# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 134 | హైదరాబాద్ | శుక్రవారం 14-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00





* ఆసిఫాబాద్ జిల్లాలో 8.2, సిరిసిల్ల జిల్లాలో 9.1 డిగ్రీలు
* రాష్ట్రవ్యాప్తంగా తగ్గిన రాత్రి ఉష్ణోగ్రతలు
* రానున్న మూడు రోజులూ వణుకే




11లో

## వేగమే వేదంగా పనిచేస్తున్నాం: సీఎం


- విశాఖ పెట్టుబడుల సదస్సుకు ముందే భారీగా ఒప్పందాలు
- ఒక్కరోజే రూ.3.65 లక్షల కోట్లకు పైగా విలువైన 35 ఎంఓయూలు
- గత ప్రభుత్వ హయాంలో వెళ్లిపోయిన కంపెనీల పునరాగమనం
- పెట్టుబడుల ఆకర్షణలో ఏపీని అగ్రస్థానంలో నిలుపుతామన్న సీఎం చంద్రబాబు
- ఒక్కరోజులో 15కి పైగా సమావేశాలకు హాజరైన చంద్రబాబు

## పెట్టుబడులకు ఫ్యూచర్ గ్యారంటీ

- హైదరాబాద్ ఇప్పటికే జీసీసీలకు గమ్యస్థానంగా మారింది
- అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో అలరారుతోంది
- మూసీ పునరుజ్జీవం పూర్తయితే నైట్ ఎకానమీ కొత్త పుంతలు




11లో



11లో

## ఫార్చ్యూన్ 25 జాబితాలో 16 కంపెనీలు భారత్ లోనే!

- ఫార్చ్యూన్ 'ప్రపంచ అత్యుత్తమ కార్యాలయాలు 2025' జాబితా విడుదల
- ప్రపంచంలోని టాప్ 25 కంపెనీల్లో 16 సంస్థలు భారత్‌లో కార్యకలాపాలు
- 90 లక్షల మంది ఉద్యోగుల సర్వే ఆధారంగా జాబితా రూపకల్పన
- గ్రేట్ ప్లేస్ టు వర్క్, ఫార్చ్యూన్ మీడియా సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించాయి

## రేపు ఉదయం 8 గంటల నుంచి జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు

11లో




- ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడి
- 58 మంది అభ్యర్థులు ఉన్నందున ప్రత్యేక అనుమతితో 42 టేబుళ్లను ఏర్పాటు చేశామన్న ఆర్వో
- 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేస్తామన్న ఆర్వో కర్ణన్

## మోడల్ వర్సిటీలుగా జేఎన్‌టీయూహెచ్, ఓయూ!

అన్ని విశ్వవిద్యాలయాల చుట్టూ ప్రహరీ ఉండాలి..

- ప్రతి హాస్టల్‌లో వెల్‌నెస్ సెంటర్ తప్పనిసరి
- 'తెలంగాణ విద్యా విధానం'పై సిఫార్సు చేయనున్న మౌలిక వసతుల కోర్ గ్రూప్

11లో



## ఢిల్లీ పేలుడు కేసు.. మూడో కారు కూడా స్వాధీనం

- ఢిల్లీ పేలుళ్ల కేసులో మూడో కారు గుర్తింపు
- ఫరీదాబాద్ యూనివర్సిటీలో డాక్టర్ షాహీన్ కు చెందిన బ్రెజా కారు స్వాధీనం
- మూడు వాహనాలతో భారీ విధ్వంసానికి ఉగ్రవాదుల కుట్ర
- ఢిల్లీతో పాటు అయోధ్య రామాలయం కూడా టార్గెట్ లిస్టులో ఉన్నట్లు వెల్లడి

11లో



## విదేశాల్లోని భారత ఉద్యోగులకు గుడ్ న్యూస్.. కేంద్రం సరికొత్త బిల్లు!

- విదేశీ ఉద్యోగుల కోసం కేంద్రం కొత్త మొబిలిటీ బిల్లు-2025
- భారత నిపుణులకు మెరుగైన అవకాశాలు, భద్రత కల్పించడం లక్ష్యం
- 1983 నాటి వలస చట్టం స్థానంలో నూతన నిబంధనలు
- వలసల స్థానంలో నైపుణ్యాలను ఎగుమతి చేసే సరికొత్త వ్యూహం
- అభివృద్ధి చెందిన దేశాల్లో కార్మికుల కొరతే భారత్‌కు అవకాశం
- యూకేతో ఒప్పందం వల్ల భారత కంపెనీలకు ఏటా రూ.4,000 కోట్ల ఆదా

11లో



భారతశక్తి

## ఈసీ స్వయంప్రతిపత్తికి భంగం

భారత రాజ్యాంగంలో ఎన్నికల వ్యవస్థకు ఉండే స్వతంత్ర ప్రతిపత్తి గురించి ఆర్టికల్ 324 తెలుపుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం లేకుండా స్వతంత్రంగా పనిచేసే అతికొద్ది సంస్థల్లో భారత ఎన్నికల వ్యవస్థ ప్రధానమైనది. ఎందుకంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటుకై ఓటర్లకు సంబంధించిన ఓటరు జాబితాను తయారు చేసేది, వివిధ రాజకీయ పార్టీలకి గుర్తింపును, రాజకీయ పార్టీలకి చిహ్నాలను కేటాయించేది కేంద్ర ఎన్నికల సంఘం. కాబట్టి ఐదు సంవత్సరాలకు ఒకసారి నూతనంగా ఏర్పాటు అయ్యే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల వ్యవస్థపై పెత్తనం చెలాయించి వివిధ రాజకీయ పార్టీలకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అనుకూలంగా వ్యవహరించేలా వేటికి కూడా హక్కు ఎన్నికల వ్యవస్థపై ఉండదు. భారతదేశం అంటే స్వేచ్ఛ, సమానత్వ, సోదరభావ, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగ దేశంగా ఉండడానికి భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 324 ద్వారా అంబేద్కర్ ఎన్నికల వ్యవస్థకు చాలా పటిష్టమైన భద్రతను ఇస్తూ స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించారు. అందుకే కేంద్ర, రాష్ట్రాలల్లో ఎంతటి బలమైన ప్రజాబలం ఉన్న నాయకులు ఉన్నప్పటికీ ఎన్నికల వ్యవస్థను, వాటిని నడిపే అధికారులను ఆయా పార్టీలకి, ప్రభుత్వాలకి అనుకూలంగా వ్యవహరించడానికి సాధ్యం లేదు. భారత రాజ్యాంగం రూపం లో ఎన్నికల వ్యవస్థకి అత్యున్నతమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉన్నది. ఇది భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అని చెప్పడానికి నిదర్శనం.కానీ గత దశాబ్ద కాలంగా కేంద్ర ప్రభుత్వంలో బిజెపి ఆధ్వర్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో కేంద్ర ఎన్నికల వ్యవస్థ కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అనేక సందర్భాల్లో అనుకూలంగా వ్యవహరిస్తున్నదని ప్రతిపక్ష పార్టీ నాయకులు బలమైన ఆధారాలతో ఆరోపణలు చేస్తున్నారు. అందులో భాగంగానే తాజాగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపిస్తూ హర్యానా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల వ్యవసను తమకి అనుకూలంగా మలుచుకొని హర్యానాలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని ఆధారాలతో సహా నిరూపించారు. అందులో భాగంగానే తాజాగా ఢిల్లీలో ప్రొజెక్టర్‌లో ఫోటో, వీడియోలు వేసి ఎన్నికల వ్యవస్థ లోపాలను వివరిస్తూ దాదాపు 25 లక్షల నకిలీ ఓట్లు హర్యానాలో ఉన్నాయని చెప్తున్నారు. అందువల్లనే హర్యానాలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. అందుకు బలమైన ఆధారాలు చూపిస్తూ బ్రెజిల్ దేశానికి చెందిన మోడల్ పేరుపై వివిధ పేర్లతో హర్యానాలో 22 చోట్ల ఓటు హక్కు ఉండడం రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ చోర్ విధానానికి బిజెపి పాల్పడుతున్నదని నమ్మక తప్పని పరిస్థితి నెలకొన్నది. అంతేకాదు బ్రెజిల్ మోడల్ కూడా రాహుల్ గాంధీ చూయించిన ఆధారాలకు స్పందించి అవి తాను గతం లోని మోడల్ ఫోటోలు అని, ప్రస్తుతం భారతదేశంలో తాను వైరల్ అవ్వడం, ఓటు హక్కు కూడా ఉండడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది మన దేశంలోని ఎన్నికల వ్యవస్థలోని లోపాలకు నిదర్శనం కాదా, విదేశీయుల ముందు అత్యున్నత విలువలతో కూడిన భారత రాజ్యాంగాన్ని అవమానపరచడం కదా! మరి రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై ఎన్నికల సంఘం తప్పులేనప్పుడు కేంద్ర ప్రభుత్వానికి, మోడీకి అనుకూలంగా ఎన్నికల సంఘం వ్యవహరించనప్పుడు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల వ్యవస్థపై తప్పుడు ఆరోపణ చేస్తూ, ఎన్నికల వ్యవస్థనే అభాసుపాలు చేస్తున్నారని ఎన్నికల కమిషన్ ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ పై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదు? కేంద్ర ఎన్నికల సంఘం తన ప్రతిపత్తిని కాపాడుకోలేకపోతున్నదంటే కేంద్ర ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నదా! అనే విషయాన్ని మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు సైతం నమ్మక తప్పడం లేదు! అంతిమంగా ఇలాంటి అనేక సందేహాలకు కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు నైతిక విలువలతో వ్యవహరించి 140 కోట్ల మంది భారతీయులకి వాస్తవాలతో కూడిన సమాధానం చెప్తూ, భారత సార్వభౌమాధికారాన్ని, భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఉండే స్వతంత్ర ప్రతిపత్తిని రక్షించి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదనే విషయాన్ని లోతుగా ఆలోచిస్తూ పార్టీలకతీతంగా, కుల, మతాలకు అతీతంగా, ప్రాంతాలకు అతీతంగా మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.ఎగ్జిట్ పోల్స్‌లో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమియే మళ్లీ అధికార పగ్గాలు చేపట్టే అవకాశం బాగా ఉందని అంచనాలు వెలువడడం ఎవరికీ ఆశ్చర్యం కలిగించడం లేదు. అసెంబ్లీ మొత్తం స్థానాలు 243 లో ఎన్‌డిఎ కూటమికి మ్యాజిక్ ఫిగర్ 122 మించి 130 నుంచి 150 వరకు స్థానాలు కైవసం అవుతాయని, విపక్ష ఇండియా కూటమికి 108 మించి స్థానాలు రావని ఎగ్జిట్ పోల్స్ ముందస్తు అంచనాలు వెలువరించడంతో ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం ఆశల పల్లకీలో ఊరేగుతోంది. మొదటి దశ పోలింగ్ 65.09 శాతం నమోదు కాగా, తుది దశ పోలింగ్ అంతకన్నా ఎక్కువగా రికార్డు స్థాయిలో 68.79 శాతం నమోదు కావడం విశేషం. 1951 తరువాత ఈ రాష్ట్రంలో ఇంతవరకూ ఇంత అధికంగా పోలింగ్ నమోదు కాలేదు. మలి విడత పోలింగ్‌పై సోమవారం ఢిల్లీ ఎర్రకోటలో జరిగిన ఉగ్రవాదుల ఆత్మాహుతి కారు బాంబు దాడి ప్రభావం కూడా కనిపించింది. 20 జిల్లాల్లోని 122 స్థానాల్లో ముస్లిం ఆధిపత్యం కలిగినవి, నక్సల్ ప్రభావితమైనవి ఉన్నప్పటికీ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. దేశంలోని ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ పెద్ద రాష్ట్రాలు. ఈ మూడు రాష్ట్రాల్లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా దేశం మొత్తం మీద ఎంతో ఉత్కంఠ కలుగుతుంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంటాయి.

# వైసీపీని కార్నర్ చేస్తున్న జనసేనాని

విజయవాడ, నవంబర్ 13,

ఏపీలో ఆ మూడు పార్టీలు కలవడానికి..పవర్‌లోకి రావడానికి..కూటమి లాంగ్ లీవ్ స్లోగన్ బలంగా వినపడానికి ఆయనే కారణం. జనం మెచ్చిన నేతగా..హైందవ సేనానిగా..మీరా మీరా మీసం తెప్పే భగత్‌సింగ్‌లాగా..ఏపీ పాలిటిక్స్‌లో నిత్యం ఓ వెలుగు వెలుగుతున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఆయన ఏం మాట్లాడిన..ఏ అంశం మీద రియాక్ట్ అయిన చర్చనీయాంశమే. లేటెస్ట్‌గా తిరుమల కల్తీ నెయ్యి ఎపిసోడ్‌పై పవన్ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది.శ్రీవారి లడ్డూ కోట్లాది మంది హిందువుల విశ్వాసానికి సంబంధించిందన్న పవన్..దర్యాప్తులో బయటపడుతున్న అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ నెయ్యితో లడ్డూ తయారీ అనేది హిందూ సమాజాన్నిగ్భ్రాంతికి గురి చేస్తుందని..సనాతన పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాల్సిందే అంటూ మరోసారి వాయిస్ రేజ్ చేశారు. తిరుపతి లడ్డూ కేవలం తీపి పదార్థం కాదని..అది ఒక భక్తి భావన, ఆధ్యాత్మిక భావోద్వేగం అంటూ సెన్సేషనల్ ట్వీట్ చేశారు. లడ్డూ కానీ తిరుమల పవిత్రతను కానీ కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు పవన్.తిరుమల లడ్డూ ఇష్యూపై దర్యాప్తు స్పీడప్ అయింది. కీలక వ్యక్తుల దర్యాప్తు వేళ..పవన్ ట్వీట్ చేయడం సమ్‌థింగ్ స్పెషల్‌గా మారింది. అయితే తిరుమల కల్తీ నెయ్యి ఎపిసోడ్ అందరి వేళ్లు..అప్పటి ప్రభుత్వంపై, గత టీడీపీ పాలకులవైపే చూపిస్తున్నాయి. ఓవైపు సిట్ టీమ్ దర్యాప్తు డిటేయిల్స్..న్యూస్ హెడ్‌లైన్‌గా మారగా..వైసీసీ కార్నర్ అవుతోంది. ఇప్పటికే అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి విచారణకు



హాజరవగా..టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి సిట్ నుంచి పిలుపురావడం కలకలం రేపుతోంది.సేమ్‌టైమ్ ధర్మారెడ్డి అప్రూవర్‌గా మారి వాంగ్మూలం ఇచ్చారన్న ప్రచారం నడుస్తోంది. సరిగ్గా ఇదే టైమ్‌లో పవన్ రియాక్ట్ అవడం అంటే..గత ప్రభుత్వంపై మరోసారి అటాక్‌కు దిగినట్లేనన్న టాక్ వినిపిస్తోంది. హిందుత్వ ఎజెండాతోనే పవన్ ట్వీట్ చేసినా..అది పూర్తిగా వైసీపీ తీరును ఎండగట్టేలా..హిందువుల మనసు గెలుచుకునేలా ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.మరోవైపు ఇప్పటికే వరుస కేసులు, నేతల అరెస్టులతో వైసీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. లేటెస్ట్‌గా నకిలీ లిక్కర్ కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ అయ్యారు. ఇక తర్వాత ఎవరు అనే చర్చ మొదలైంది. అయితే ఈసారి వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరును ప్రస్తావిస్తున్నారు కూటమి నేతలు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పెద్దిరెడ్డిని గట్టిగానే టార్గెట్ చేశారన్న ప్రచారం సాగుతోంది.చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి ఆక్రమించిన అటవీ భూముల ఫొటోలను తీసినట్లు మొన్న క్యాబినెట్ భేటీలో చెప్పుకొచ్చారు. పెద్దిరెడ్డి లెక్కలన్నీ తీస్తున్నామని కూడా పవన్ అన్నట్లు తెలుస్తోంది. అయితే పవన్ కల్యాణ్ ఎవరిపై వ్యక్తిగతంగా టార్గెట్ చేయరు. కానీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెద్దిరెడ్డిని నిన్ను వదలా అంటున్నారు.నిజానికి పెద్దిరెడ్డి, చంద్రబాబుకు మధ్య ఏళ్ల నాటి వైరం ఉందంటారు. కానీ సీబీఎన్ రాజకీయ ప్రత్యర్థిపై పవన్ ఫోకస్ పెట్టడం చర్చనీయాంశంగా మారుతోంది. 2024 ఎన్నికల్లో పిఠాపురంలో పవన్‌ను ఓడించేందుకు పెద్దిరెడ్డి ఫ్యామిలీ..ఎస్పెషల్‌గా ఎంపీ మిథున్ రెడ్డి ప్రయత్నం చేశారని గుర్తు చేస్తున్నారు.ఎన్నికల ప్రచారంలో కూడా పవన్ మిథున్‌రెడ్డి పేరును ప్రస్తావించారు. ఆ తర్వాత పవన్ గెలిచారు. కూటమి అధికారంలోకి వచ్చింది. ఏరి కోరి అటవీ శాఖను తీసుకున్నారు పవన్. పెద్దిరెడ్డి లెక్క తేల్చడానికి పవన్ అటవీశాఖను తీసుకున్నారన్న ప్రచారం కూడా ఉంది. ఆ ప్రచారానికి తగ్గట్టుగా ఇప్పుడు దూకుడు కనిపిస్తోంది. ఇలా ఆల్ రౌండర్‌గా టీమ్ కూటమిని ఎప్పుడూ లైమ్‌లైట్‌లో ఉంచుతున్నారు సేనాని. ఆయన దూకుడు..అంతకు మించి వ్యూహం..కూటమికి ఇంకెంత అడ్వాంటేజ్‌గా మారుతుందో చూడాలి మరి.

# విడుదల రజనీకి వరుస కష్టాలు

గుంటూరు, నవంబర్ 14,

విడదల రజిని.. వైసీపీ హయాంలో ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన ఆమె. అప్పట్లో ఓ రేంజ్‌లో హవా నడిపించారు. చిలకలూరిపేటలో మొదటిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన తర్వాత సీనియర్లను కాదని మంత్రి అయిన ఈ మహిళా నేత..2024లో మరొక నియోజకవర్గం పోటీ చేసి దారుణంగా ఓడిపోయారు.ఆ తర్వాత తిరిగి సొంత నియోజకవర్గం చిలకలూరిపేటకు వచ్చారు. అప్పటి నుంచి ఆమెకు అన్నీ సవాళ్లే ఎదురవుతున్నాయి. ఓవైపు రాజకీయ ప్రత్యర్థుల నుంచి ఇబ్బందులను ఫేస్ చేస్తున్న ఆమె.. మరోవైపు కేసులు, అవినీతి ఆరోపణలు..ఒకదాని తర్వాత మరోక ఇష్యూతో తీవ్ర విమర్శల పాలవుతున్నారు. సేమ్‌టైమ్ మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి ఆమె ఫ్యామిలీ మెంబర్స్, తన పీఏలపై కూడా అలిగేషన్స్ ఎక్కువయ్యాయి.

విడదల రజిని గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసి ఓడిన తర్వాత సొంత ఇంటిలో కుంపట్లు మొదలయ్యాయి. రజని మరిది గోపి, పీఏ రామకృష్ణ మీద అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో చిలకలూరిపేటను గోపి చూసుకుంటాడు అనే ప్రచారం జరిగింది. ఇప్పటికే అవినీతి ఆరోపణలు నేపథ్యంలో కుంటుబం రెండుగా విడిపోయిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇక ఫ్యామిలీలో విభేదాలు, అవినీతి ఆరోపణలు, కేసుల సంగతి అలా ఉంటే..రాజకీయంగా అత్యంత క్లిష్ట పరిస్థితులను ఫేస్ చేస్తున్నారు విడదల రజిని. మొన్నటి వరకు వైసీపీలో ఉన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ టీడీపీలో చేరిపోయారు. అటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వర్గం..ఇటు మర్రి వర్గం..మరోవైపు పుల్లారావు ఇలా మూడు దిక్కుల నుంచి విడదలను పొలిటికల్‌గా కార్నర్ చేస్తున్నారట. అయితే చిలకలూరిపేట నుంచి పోటీ చేయాలంటే ఆ ముగ్గుర్ని తట్టుకొని నిలబడే నేతేవరు లేరట. అందుకే విడదల రజినినే కంటిన్యూ అవుతున్నారని అంటున్నారు.చిలకలూరిపేట అంటేనే కమ్మ సామాజిక వర్గం ఎక్కువ ఉండే సెగ్మెంట్. అలాంటి నియోజకవర్గంలో బీసీ మహిళా పోటీ చేసి గెలిచింది. కానీ సామాజిక



వర్గాల పరంగా అక్కడా ఇప్పటికే చుక్కెదురే అవుతుంది. 2019 ఎన్నికల్లో తనని ఓడించేందుకు ప్రయత్నాలు జరిగాయని, మర్రి రాజశేఖర్, లావు శ్రీ కృష్ణ దేవరాయలు ఓడించేందుకు ప్రయత్నం చేశారని గతంలోనే జగన్‌కు చెప్పుకున్నారు విడదల. ఇప్పుడా ఇద్దరు నేతలు టీడీపీలో ఉన్నారు.అయితే చిలకలూరిపేట ఇంచార్జ్‌గా ఉన్న మాజీ మంత్రి విడదల రజినిని రేపల్లెకు మారుస్తారనే ప్రచారం జరుగుతోంది. పేటలో రజినిపై క్యాడర్‌లో అసంతృప్తి ఎక్కువగా ఉందని అంటున్నారు. వరుస ఇష్యూస్ నేపథ్యంలో రజినిని చిలకలూరిపేట నుంచి..రేపల్లెకు మారుస్తారంటూ గాసిప్స్ చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం రేపల్లె ఇంచార్జ్‌గా ఈవూరి గణేష్ ఉన్నారు. సీనియర్ నేత మోపిదేవి వెంకటరమణను కాదని గణేష్‌కు టికెట్ ఇస్తే, ఎన్నికల్లో ఓడిన తర్వాత ఆయన పార్టీని పెద్దగా పట్టించుకోవడం లేదట.దీంతో రజినిని రేపల్లెకు మార్చి చిలకలూరిపేటకు కొత్తవారిని తీసుకొస్తారనే టాక్ వినిపిస్తోంది. పొన్నూరులో కూడా ప్రస్తుతం సరైన ఇంచార్జ్ లేరన్న వాదన వినిపిస్తోంది. దీంతో రజినిని అక్కడికి మార్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అంటున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇంచార్జ్‌ను మార్చాలని కొంతమంది వైసీపీ నేతలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారట. దీంతో రజనిని మార్చి మరొక నియోజకవర్గంకు పంపుతారా లేక చిలకలూరిపేటకే పరిమితం చేస్తారా అనేది వేచి చూడాలి.

## ఏపీలోనూ ఢిల్లీ ఉగ్రలింక్ లు

విజయవాడ, నవంబర్ 14, (న్యూస్ పల్స్)

ఢిల్లీలోని రెడ్ ఫోర్ట్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలో వెలుగులోకి వచ్చిన వివరాలతో పలు రాష్ట్రాల్లో ఉగ్రవాద సానుభూతిపరులను పట్టుకుంటోంది. బుధవారం ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ దర్యాప్తు సంస్థ విస్తృత సోదాలు చేపట్టింది. గుంటూరు, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉగ్ర మూలాలు, రాడికలైజేషన్ నెట్‌వర్క్‌లపై అనుమానంతో అధికారులు దాడులు చేశారు. 5 మందిని డిటేన్ చేసి, ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్, రాడికల్ మెటీరియల్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఏపీలో -కొరసాన్ మూలాలు బయటపడ్డాయి. ఢిల్లీ పేలుడుకు ఏపీ లింక్ ఉందా అనే అనుమానంతో జాతీయ దర్యాప్తు సంస్థ ఆదిశగా విచారణ చేస్తోంది. రాష్ట్ర పోలీస్, యిలతో కలిసి ఈ ఆపరేషన్ జరుగుతోందిఢిల్లీ హెడ్‌క్వార్టర్స్ నుంచి వచ్చిన స్పెషల్ టీమ్‌లు మంగళవారం తెల్లవారుజామున 5:30 గంటలకు ఏపీలోని మూడు కీలక ప్రాంతాల్లో సోదాలు ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. గుంటూరులో అహ్మద్ అలీ అనే యువకుడి ఇంటిపై దాడి చేసి, ఎూఎూ ప్రచార మెటీరియల్, టెలిగ్రామ్ చాట్ లాగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అతన్ని డిటేన్ చేసి, విచారణ చేస్తున్నారు. గతంలో ఈ యువకుడు రాడికలైజేషన్ గ్రూపుల్లో చాట్‌లు చేసినట్టు తేలింది. విజయనగరం మదరసాలో మూలాలు ఉన్నాయనే ఇంటెలిజెన్స్ ఆధారంతో జాతీయ దర్యాప్తు సంస్థటీమ్ సోదాలు చేసింది. ముగ్గుర్ని డిటేన్ చేశారు. విశాఖపట్నం మధురవాడ, మునసవాడలో రెండు ఇళ్లలో దాడులు చేశారు.

# ఆత్మ పరిశీలనలో తప్పొప్పులు గుర్తించిన ప్రవీణ్ ప్రకాష్

విజయవాడ, నవంబర్ 14,

మాజీ అధికారి ప్రవీణ్ ప్రకాష్ జగన్ హయాంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలపై మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు , మాజీ అధికారి జాస్తి కృష్ణకిషోర్‌లకు పబ్లిక్‌గా క్షమాపణలు చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న ప్రవీణ్ ప్రకాష్, తన తప్పులను ఒప్పుకుంటూ భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేస్తూ వీడియో విడుదల చేశారు. 30 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్‌తో అనుబంధం కలిగి ఉన్నాను. ఒక్క రూపాయి కూడా అవినీతి ద్వారా సంపాదించలేదు. ఎప్పుడూ చట్ట విరుద్ధంగా ఫైల్‌లలో నోటింగ్ చేయలేదు, అనుమతి ఇవ్వలేదు. నా జూనియర్లకు కూడా అలాంటి సూచనలు చేయలేదు అని అన్నారు. గత ఏడాది జూన్-జూలైలో విజయవాడలో ఉండగా సోషల్ మీడియాలో తీవ్ర ట్రోలింగ్‌కు గురికావడంతో మానసికంగా కుంగిపోయానని, అది ఎఖీూ తీసుకోవడానికి కారణమైందని వెల్లడించారు. అక్టోబర్‌లో ఢిల్లీకి వచ్చిన తర్వాత ఏడాది పాటు ఆత్మపరిశీలన చేశానని, తన తప్పులను గుర్తించానని చెప్పారు.2000-2004 మధ్య గుంటూరు, విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ప్రజల నుంచి ఎంతో ప్రేమ, ఆదరణ, హీరో వర్షిప్ లభించిందని ప్రవీణ్ ప్రకాష్ గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, లండన్, న్యూయార్క్, వాషింగ్టన్, కెనడాలలో కూడా గుంటూరు-విజయవాడ ప్రజలు నన్ను గుర్తుపట్టి ఆప్యాయంగా మాట్లాడేవారు. అది నాకు ఆక్సిజన్ లాంటిది, పని చేయడానికి ప్రేరణ అని అన్నారు. అయితే, సడెన్‌గా ఆ ఆదరణ ట్రోలింగ్‌గా మారడం తనలో మానసిక ఆందోళన కలిగించిందని, ఆత్మపరిశీలనలో సమాజం తనపై పెట్టుకున్న అంచనాలకు తగ్గట్టు వ్యవహరించలేకపోయానని గ్రహించానని చెప్పారు.ముఖ్యంగా 2020లో జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫైల్ గురించి ప్రవీణ్ ప్రకాష్ వివరించారు. డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన ఆ ఫైల్‌లో అడిషనల్ ఏబీ వెంకటేశ్వరరావు (1989 బ్యాచ్ ఎఖూ)పై డిసిప్లినరీ యాక్షన్ సిఫార్సు చేసిన అంశానికి సంబంధఇంచినది. "చార్జెస్ ముఖ్యంగా సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్‌కు విరుద్ధంగా కనిపించాయి. కానీ ప్రాక్టీస్‌లో అలాంటివి ఆమోదయోగ్యమే. ఉదాహరణకు, గవర్నమెంట్ వాహనాన్ని ప్రైవేట్ పనికి ఉపయోగించినప్పుడు చెల్లింపు చేయాలని రూల్ ఉంది. కానీ 30 ఏళ్ల కెరీర్‌లో ఎవరూ అలా చేయరు, అది సాధారణమే" అని వివరించారు.అయితే, ఆ ఫైల్‌ను చట్టపరమైన దృక్కోణం నుంచి మాత్రమే పరిశీలించి, యాక్షన్ సిఫార్సు చేశానని, ఇప్పుడు అది తప్పని గ్రహించానని ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. "ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయిలో ఉన్న నాకు సమాజం ఎక్స్‌పెక్టేషన్ ఎథిక్స్, మొరాలిటీ లెన్స్‌తో ఫైల్‌లు పరిశీలించాలి. రోల్ రివర్సల్ టెస్ట్ అప్లై చేస్తే ? ఆ చార్జెస్ నాపై ఉంటే న్యాయమా? ? అని ఆలోచిస్తే, ఆ ప్రతిపాదనను తిరస్కరించాల్సింది" అని చెప్పారు. ఇలాంటి పరిస్థితే జాస్తి కృష్ణకిషోర్ కేసులో కూడా జరిగిందని, ఆ ఇద్దరికీ తన నిర్ణయాల వల్ల మానసిక, సామాజిక బాధలు కలిగాయని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. "ఏబీ వెంకటేశ్వరరావు , కృష్ణకిషోర్ లకు ఫోన్ చేసి సారీ చెప్పాను. కానీ మనిషి సామాజిక జీవి కాబట్టి, పబ్లిక్‌గా కూడా క్షమాపణలు చెబుతున్నాను. మీరు మీ మనసులో నన్ను క్షమించండి" అని భావోద్వేగంగా అన్నారు. ఢిల్లీలోని స్నేహితులు ఈ అపాలజీపై ప్రశ్నించగా, "ఇది నా స్వార్థపరమైన చర్య కాదు. వారి బాధలను తిరిగి తీసుకురాలేను, కానీ నా మనసు శుభ్రం చేసుకోవాలి. భవిష్యత్తులో నా కెరీర్ 2.0లో ఎథిక్స్, మొరాలిటీ లెన్స్‌తోనే నిర్ణయాలు తీసుకుంటాను" అని సమాధానమిచ్చారు.

# వికారాబాద్లో విద్యార్థికి విద్యుత్ షాక్ ? పరిస్థితి విషమం

వికారాబాద్ నవంబర్ 14, వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గంగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘోర ప్రమాదం జరిగింది. పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకుని ఎలాంటి రక్షణ కంచ లేకుండా ఏర్పాటు చేసిన 33 కె.వి ట్రాన్స్ఫార్మర్ కారణంగా మూడవ తరగతి విద్యార్థి వంశీ తీవ్రంగా గాయపడ్డాడు.సమాచారం ప్రకారం, మధ్యాహ్న భోజన విరామ సమయంలో వంశీ పాఠశాల బయటకు వెళ్లినప్పుడు ట్రాన్స్ఫార్మర్ వైర్లను తాకడంతో విద్యుత్ షాక్ తగిలి చేతులు, కాళ్ళు కాలిపోయాయి. తలకు గాయాలు కావడంతో పాటు ముక్కు నుండి రక్తం కారింది. వెంటనే స్పందించిన పాఠశాల సిబ్బంది, స్థానికులు గాయపడిన విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చిన్నపిల్లలకు అవసరమైన వైద్య సదుపాయాలు, డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో జిల్లా, మండల అధికారులతో సంప్రదించి విద్యార్థిని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రి ఈశాకు తరలించారు.ప్రస్తుతం వంశీ పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. పాఠశాల వద్ద నిర్లక్ష్యంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్పై తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకుని విద్యార్థికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రిటైర్మెంట్ కుగంటా ప్రిపేర్

విశాఖపట్టణం, నవంబర్ 13,

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీ చేసే అవకాశం కనిపించడం లేదు. ఆయన తన కుమారుడికి తన రాజకీయ వారసత్వాన్ని అప్పగించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అనేక పార్టీలు మారినా, అనేక నియోజకవర్గాలు మారినా గంటా శ్రీనివాసరావుకు ఎప్పుడూ ఎదురుదెబ్బ తగలలేదు. కానీ ఈసారి మాత్రం ఆయన ఊహించిన విధంగా రాజకీయం సాగడం లేదు. తాను గెలిచి మంత్రిని కావాలనుకున్నప్పటికీ ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. అంతేకాకుండా విశాఖ జిల్లా నుంచి వంగలపూడికి అనితకు ఇవ్వడంతో గంటా శ్రీనివాసరావుకు ఇక తాను రాజకీయాల్లో కొనసాగడం అనవసరమన్న భావన ఆయన అనుచరుల వద్ద వ్యక్తం చేస్తున్నట్లు కనపడుతుంది. తిరిగి కూటమితోనే... టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వచ్చే ఎన్నికల్లోనూ పోటీకి దిగుతుంది. మరొకసారి అధికారంలోకి వచ్చినప్పటికీ ఈ కాంబినేషన్ లో తనకు మంత్రి పదవి దక్కే అవకాశం లేదన్న నిర్ణయానికి గంటా శ్రీనివాసరావు వచ్చారు. ఒక రకంగా చెప్పాలంటే మొన్నటి ఎన్నికల్లోనే గంటా శ్రీనివాసరావుకు తొలి జాబితాలో టిక్కెట్ దక్కలేదు. చీపురుపల్లికి వెళ్లాలని కూడా నాయకత్వం సూచించింది. అయితే గంటా శ్రీనివాసరావు పట్టుబట్టి మరీ భీమిలీ సీటును తెచ్చుకున్నారు. గెలిచిన తర్వాత మాత్రం ఆయన సంతోషంగా లేరన్నది వాస్తవం. ఒక వైపు కాపులు ఎక్కువగా చంద్రబాబు మంత్రివర్గంలో ఉండటం, తన వియ్యంకుడు నారాయణ మంత్రిగా ఉండటంతో ఆయనకు కలసి రాలేదన్నది వాస్తవం. దీంతో ఈసారి పోటీ చేసినా మంత్రి పదవి తనకు జిల్లా కోటాలోనూ, సామాజికవర్గం కోటాలోనూ తనకు మంత్రి పదవి దక్కదని ఆయన అంచనా వేసుకుంటున్నారు. ఇక పార్టీలు మారి కూడా ప్రయోజనం లేదని, అందుకే కూటమిలోనే తమ కుటుంబం ఉంటూ తన కుమారుడిని రాజకీయంగా అందిపుచ్చుకునేలా చేయాలని గంటా శ్రీనివాసరావు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అదీ గంటా శ్రీనివాసరావు తన కుమారుడిని భీమలి నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలని భావిస్తున్నారని, ఇప్పటికే ఈ మేరకు పార్టీలోని ముఖ్య నేతలకు, తన ప్రధాన అనుచరులకు సంకేతాలు ఇచ్చారని అంటున్నారు. గంటా శ్రీనివాసరావు ఇక రాజకీయాలకు స్వస్తి చెప్పి వ్యాపారాలను చూసుకోవడమో.. లేక విశ్రాంతి తీసుకోవడమో చేయాలని భావిస్తున్నారు

# కూకట్ పల్లి భాగ్యనగర్ లో మద్యం షాపుకు వ్యతిరేకంగా ఆందోళన

హైదరాబాద్ నవంబర్ 13,

కూకట్ పల్లి భాగ్యనగర్ కాలనీలో తమ కాలనీలో మద్యం షాపు వద్దంటూ మహిళలు కాలనీవాసులు రోడెక్కారు. భాగ్యనగర్ కాలనీలో కెపిహెచ్ఇ మెట్రో స్టేషన్ ఆనుకునిఉన్న కాంప్లెక్స్ లో మద్యం దుకాణం వల్ల తమకు తీవ్ర ఇబ్బందులు జరుగుతున్నాయని మహిళలు ఆందోళన చేపట్టారు. గురువారం కాలనీవాసులు మహిళలు అందరూ కలిసి రోడ్డుపై ప్రదర్శన నిర్వహించి నడిరోడ్డుపై టెంట్ హౌస్ వేసుకొని ధర్నా నిర్వహించారు.తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ ఇక్కడ షాపు వద్దంటూ కోర్టుకి అలాగే పోలీసుల వద్దకు ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లినప్పటికీ అందరూ హామీలు ఇచ్చారు తప్పితే షాపును తీయడం లేదని అన్నారు. ఈ మందు బాబులు ఇక్కడ తిష్ట వేయటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నామని వాపోయారు. తమకు న్యాయం చేయాలంటే ఎవరిని సంప్రదించాలో కూడా అర్థం కాని పరిస్థితిలో తామున్నామని అన్నారు. మహిళలు, పిల్లలు ఇటువైపు ఈ రోడ్డు కూడా వెళ్లడానికి భయపడుతున్నారని మందుబాబులు తమను రకరకాలుగా వేధిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా తమ వినతిని మన్నించి ఈ షాపు ఇక్కడ ఏర్పాటు చేయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# దేవాలయంలో చోరీ

నిర్మల్ నవంబర్ 13,

జిల్లా కేంద్రంలోని బంగల్ పెట్ వద్ద మహాలక్ష్మి కాలనీ లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిన్న అర్థరాత్రి దేవాలయం ముఖద్వారం పగలగొట్టి సిసి టీవీ కెమెరాల కనెక్షన్ ను కట్ చేసి చోరీ, అమ్మవారి మంగళసూత్రం ముక్కుపుడక తో పాటు 500 గ్రాముల వెండి నగలు, హుండీని పగలగొట్టి 30 వేల రూపాయల నగదును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకొని వెళ్లారు. నిర్మల్ టౌన్ పోలీసులు ఘటనస్థలికి చేరుకొని ఫింగర్ ప్రింట్ డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేపట్టి దర్యాప్తు చేస్తున్నారు.

===================

# ఐటిఐ విద్యార్ధులకు సైబర్ నేరాలపై అవగాహన

ఏలూరు నవంబర్ 13,

సైబర్ నేరగాళ్ల వలలో చెప్పకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉ



ండాలని శక్తి టీం సీఐ సుబ్బారావు సూచించారు ఏలూరు సత్రంపాడు లోని ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల పోలీస్ సేవలు పట్ల శక్తి టీం సిబ్బందిఅవగాహన కల్పించారు. సైబర్ నేరాల కోసం 1930, మహిళా రక్షణ కోసం 181 అత్యవసర సమయాలలో 112 సేవలు వినియోగించుకుని పోలీసుల సహాయాన్ని పొందవచ్చునని వారికి సూచించారు. అప్రమత్తతే నేరాల నివారణ అని సిఐ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సిబ్బందితో పాటు శక్తి టీమ్ ఎస్ఐ నాగమణి పాల్గొన్నారు

# కాపులప్పాడులో ఐటీ క్యాంపస్

విశాఖపట్టణం, నవంబర్ 13,

విశాఖపట్నంలోని కాపులుప్పాడలో మరో అత్యాధునిక ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. క్వార్ట్జ టెక్నోసాఫ్ట్ లిమిటెడ్ ఈ ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ సుమారు రూ. 115 కోట్లు పెట్టుబడి రానుంది. ఈ క్యాంపస్ ద్వారా ప్రత్యక్షంగా 2 వేల మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.ఈ కొత్త క్యాంపస్‌లో అడ్వాన్స్డ్ డిజిటల్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి కీలక విభాగాలపై దృష్టి సారించనున్నారు. ప్రభుత్వం ఈ సంస్థకు ఎకరం రూ. కోటి చొప్పున, మొత్తం 4 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.క్వార్ట్జ టెక్నోసాఫ్ట్ లిమిటెడ్ సంస్థ రెండేళ్లలో క్యాంపస్ తొలి దశ కార్యకలాపాలను ప్రారంభించాలని, అలాగే మొత్తం ప్రాజెక్టును ఐదేళ్లలో పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. ఏపీ ఐటీ అండ్ జీసీసీ పాలసీ 4.0 ప్రకారం ఈ సంస్థకు అవసరమైన అన్ని ప్రోత్సాహకాలను అందించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులను ఐటీ, ఎలక్ట్రానిక్స్ విభాగం కార్యదర్శి కాటమనేని భాస్కర్ జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని టీఎస్ ఎండీ మరియు ఏపీఐఐసీ ఎండీలకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.విశాఖలో 1.35 లక్షల కోట్లతో గూగుల్ కు చెందిన అనుబంధ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి ఏపీ ప్రభుత్వంతో ఇటీవల ఒప్పందం చేసుకుంది. ఆపై మరో కంపెనీ సైతం దాదాపు 80 వేల నుంచి లక్ష కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. పలు ప్రముఖ ఐటీ కంపెనీలు విశాఖలో ఐటీ క్యాంపస్, డేటా సెంటర్లు ఏర్పాటు చేయడాని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఒప్పందాలు చేసుకుంటున్నాయి. దాంతో కొంత కాలానికే డేటా సెంటర్ల హబ్‌గా విశాఖ రూపురేఖలు మారిపోనున్నాయని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. క్వార్ట్జ టెక్నోసాఫ్ట్ లిమిటెడ్ సంస్థ రెండేళ్లలో క్యాంపస్ తొలి దశ కార్యకలాపాలను ప్రారంభించాలని, అలాగే మొత్తం ప్రాజెక్టును ఐదేళ్లలో పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. ఏపీ ఐటీ అండ్ జీసీసీ పాలసీ 4.0 ప్రకారం ఈ సంస్థకు అవసరమైన అన్ని ప్రోత్సాహకాలను అందించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులను ఐటీ, ఎలక్ట్రానిక్స్ విభాగం కార్యదర్శి కాటమనేని భాస్కర్ జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని టీఎస్ ఎండీ మరియు ఏపీఐఐసీ ఎండీలకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆపై మరో కంపెనీ సైతం దాదాపు 80 వేల నుంచి లక్ష కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. పలు ప్రముఖ ఐటీ కంపెనీలు విశాఖలో ఐటీ క్యాంపస్, డేటా సెంటర్లు ఏర్పాటు చేయడాని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఒప్పందాలు చేసుకుంటున్నాయి. దాంతో కొంత కాలానికే డేటా సెంటర్ల హబ్‌గా విశాఖ రూపురేఖలు మారిపోనున్నాయని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# బుట్టా రేణుకాకు కష్టకాలమేనా

కర్నూలు, నవంబర్ 13,



మాజీ పార్లమెంటు సభ్యురాలు బుట్టా రేణుకను ఎమ్మిగనూరు ఇన్ ఛార్జి నుంచి తప్పించి వైసీపీ నాయకత్వం పెద్ద తప్పు చేసిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. అక్కడ ఆమెను కొనసాగించకుండా కర్నూలు పార్లమెంటు ఇన్ ఛార్జిగా నియమించడంతో బుట్టా రేణుక సామాజికవర్గం ఫ్యాన్ పార్టీకి రివర్స్ అయ్యే అవకాశాలున్నాయంటున్నారు. 2014లో వైసీపీ నుంచి బుట్టా రేణుక కర్నూలు పార్లమెంటు సభ్యురాలిగా గెలిచారు. అయితే అప్పట్లో వైసీపీ అధికారంలోకి రాకపోవడంతో ఆమె పార్టీ మారారు. టీడీపీలోకి వెళ్లినా ఆమెకు సరైన ప్రాధాన్యత లభించకపోవడంతో తిరిగి వైసీపీ చెంతకు చేరారు. మొన్నటి ఎన్నికల్లో బుట్టా రేణుకకు ఎమ్మిగనూరు అసెంబ్లీ టిక్కెట్ ను జగన్ ఇచ్చారు.అయితే మొన్నటి కూటమి గాలిలో బుట్టా రేణుక కూడా ఓటమి పాలయ్యారు. అయితే ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లాలో ఎక్కువగా బుట్టా రేణుక సామాజికవర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఎమ్మిగనూరు నుంచి వచ్చే ఎన్నికల్లో తిరిగి పోటీ చేయాలని బుట్టా రేణుక అక్కడ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని పార్టీ క్యాడర్ కు అందుబాటులో ఉంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా వైసీపీకి అనుకూలంగా మారుతుందని, అన్నీ అనుకున్నట్లు జరిగితే తాను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే కావచ్చని బుట్టా రేణుక నిన్న మొన్నటి వరకూ భావించారు. కానీ ఒక్కసారిగా పార్టీ నాయకత్వం ఆమెను అక్కడి నుంచి తప్పించి కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ ఇన్ ఛార్జిగా నియమించడంతో ఆమె నిరాశకు గురయ్యారు. ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే చెన్న కేశవరెడ్డి వర్గానికి, బుట్టా రేణుకకు మధ్య గ్యాప్ పెరగడంతోనే వైసీపీ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ సామాజికవర్గం కోణంలో అది పార్టీకి ఇబ్బంది తెచ్చిపెడుతుందని భావిస్తున్నారు. ఎమ్మిగనూరు వైసీపీ ఇన్ ఛార్జిగా చెన్నకేశరెడ్డి కుమారుడు రాజీవ్ రెడ్డిని నియమించడం పట్ల కూడా రేణుక వర్గంలో అసంతృప్తి తలెత్తిందంటున్నారు. ఇద్దరినీ చెరోచోటికి పంపామని, అంతా సెట్ అయినట్లేనని పార్టీ నాయకత్వం భావిస్తున్నా భవిష్యత్ లో మాత్రం రాజకీయంగా ఇబ్బందులేనన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. మరి వైసీపీ నాయకత్వం అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం కర్నూలు జిల్లాపై కూడా పడే అవకాశం లేకపోలేదంటున్నారు. బీసీలకు అన్యాయం జరిగిందన్న భావన వ్యక్తమవుతుంది. బుట్టారేణుక ప్రస్తుతం సైలెంట్ గా ఉన్నప్పటికీ ఎన్నికల నాటికి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# విశాఖ సమిట్‌కు అంతా రెడీ

విశాఖపట్టణం, నవంబర్ 13,

సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు బుధవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి నేరుగా విశాఖ చేరుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించే 30వ సి.ఐ.ఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ సన్నాహకాలపై అధికారులు, మంత్రులతో సమీక్షిస్తారు. భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ అమిత్ కళ్యాణితో సమావేశం అవుతారు. 4 రోజుల పాటు వరుసగా వన్ టు వన్ భేటీలు, సమావేశాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలలో విశాఖ నుంచి పాల్గొననున్నారు. భాగస్వామ్య సదస్సుకు తరలివస్తున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో గురువారం వరుసగా సమావేశం అవుతారు. నోవాటెల్ హోటల్ లో ఉదయం 'ఇండియా?యూరోప్ బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశం'లో పాల్గొనన్నారు. పార్ట్నర్స్ ఇన్ ప్రోగ్రెస్' ? సస్టైనబుల్ గ్రోత్‌పై ప్రారంభ సెషన్ లో మాట్లాడతారు. తైవాన్, ఇటలీ, స్వీడన్, నెదర్లాండ్స్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు ఉంటాయి. వైజాగ్ ఎకనామిక్ రీజియన్ పై జరిగే కార్యక్రమానికి, సి.ఐ.ఐ నేషనల్ కౌన్సిల్ నిర్వహించే ప్రత్యేక సమావేశానికి హాజరవుతారు. నవంబర్ 14న సిఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభం అవుతుంది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ హాజరవుతున్నారు. మొదటగా ఏపీ పెవిలియన్‌కు ప్రారంభోత్సవం ఉంటుంది. ఏఐ ఫర్ వికసిత్ భారత్ సెషన్‌లో సీఎం చంద్రబాబు ప్రత్యేక ప్రసంగం చేస్తారు. సదస్సు నుంచే ఏపిలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల ప్రారంభమవుతాయి. సింగపూర్ కు నేరుగా విమాన సర్వీసులపై ఒప్పందం, ఏపీ రీఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్ సమ్మిట్'లో సీఎం ముఖ్య ప్రసంగం ఉంటుంది. అలాగే విశాఖలో లులూ మాల్‌కు శంకుస్థాపన జరుగుతుంది.

వి. బహ్రెయిన్, న్యూజిలాండ్, జపాన్, కెనడా, మెక్సికో ప్రతినిధులతో సీఎం సమావేశం అవుతారు. 'గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ', 'సస్టైనబుల్ సిటీస్', 'ఆంధ్ర టూరిజం విజన్' సెషన్లు జరుగుతాయి. మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన 'ఏఐ అండ్ ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్'పై ముఖ్య చర్చ కూడా ఉంటుంది. 'ఇన్వెస్టింగ్ ఫ్రమ్ అబ్రాడ్ : ఎన్ఆర్టీస్ ఫర్ వికసిత్ భారత్' పై సీఎం సమీక్ష చేస్తారు.

సదస్సులో చివరిగా ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియా బ్రీఫింగ్ ఉంటుంది. మొత్తంగా సదస్సులో 100కి పైగా అంతర్జాతీయ ప్రతినిధులతో సమావేశాలు, 30కి పైగా ఒప్పందాలపై సంతకాలు జరుగుతాయి. అలాగే ఏఐ, స్పేస్, గ్రీన్ హైడ్రోజన్, టూరిజం, ఎంఎస్ఎంఈ, ఫైనాన్స్ రంగాలపై కీలక చర్చలతో పాటు ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడంతో పాటు, భారీఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు, యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తారు. విశాఖ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు జరిగేలా ఇప్పటికే గ్రౌండ్ ప్రిపేర్ చేశారు. మ్మిట్ ను విజయవంతం చేసేందుకు ఇప్పటికే దేశ విదేశాల్లో పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తూ రోడ్ షోలు, పర్యటనలు చేశారు.

# విస్తృతంగా ప్రైవేటు బస్సుల తనిఖీలు

బాపట్ల నవంబర్ 13,

బాపట్లలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంగారావు బుధవారం రాత్రి విస్తృతంగా ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. బాపట్ల నుంచి హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం వంటి పట్టణాలకు వెళ్లే పలు బస్సులపై ఈ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ప్రైవేటు బస్సులో ఎమర్జెన్సీ ద్వారం తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, అలాగే ప్రయాణికుల భద్రత కోసం ప్రతి కిటికీ పక్కన హేమర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కిటికీ అద్దంపై అత్యవసర పరిస్థితుల్లో పగలగొట్టి బయటకు రాగలరనే సూచన స్పష్టంగా రాసి ఉంచాలని ఆయన ఆదేశించారు. ప్రమాదం సంభవించినప్పుడు బస్సు లోపల అలారం వెంటనే మోగేలా ఉండటాన్ని, ఇలాంటివన్నీ రెగ్యులర్గా తనిఖీ చేయాలన్నారు. అదేవిధంగా, బస్సులో అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఉపయోగించగల అగ్నిని ఆర్పే గ్యాస్ సిలిండర్ ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలని డ్రైవర్లకు సూచనలు జారీ చేశారు. ప్రమాద సూచనలు గమనించిన వెంటనే ప్రయాణికులు డ్రైవర్ను అప్రమత్తం చేయాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు

# పోలీసులకు వాహనాల అందజేత

కాకినాడ నవంబర్ 13,

పోలీసశాఖను బలోపేతం చేసి తద్వారా ప్రజల రక్షణకు పెద్దపీట వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ ఎంపీ తంగెళ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు.. ఎంపీ నిధుల ద్వారా 36 లక్షలతో సమకూర్చిన టీయూవీ వాహనాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బిందు మాధవ్ కు అందజేశారు. కాకినాడ ఎస్డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్,డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

# పాడి బిల్లులకోసం వీరవెల్లి గ్రామ రైతుల బైఠాయింపు

యాదాద్రి భువనగిరి నవంబర్ 13,

పాడి రైతులకు 8 బిల్లులు చెల్లించాలంటూ భువనగిరి పాల శీతలీకరణ కేంద్రం ముందు ప్రధాన రహదారి పై వీర వెల్లి గ్రామ రైతులు బైఠాయించారు. ప్రధాన రహదారి పై బైఠాయించటం తో ఇరు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. వీరవెల్లి గ్రామానికి సుమారు 120 మంది రైతులకు 24 లక్షల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని పాడి రైతుల ఆరోపణ. వెంటనే పాడి రైతుల బిల్లు లను చెల్లించాలని డిమాండ్ చేసారు.

# ఈఎస్ఐ ఆసుపత్రిలో సర్వర్లు మొరాయింపు రోగుల నిరీక్షణ

హైదరాబాద్ నవంబర్ 13,

సనత్ నగర్ ఈఎస్ఐ హాస్పిటల్ లో అవుట్ పేషంట్లు ఇబ్బంది పడుతున్నారను. గురువారం ఉదయం నుండి సర్వర్లు పను చేయడం లేదు. దీనితో ఓపి బుక్ చేసుకునేందుకు అవుట్ పేషెంట్స్ ఇబ్బందులు పడుతున్నారు. ఫోన్లో ఆండ్రాయిడ్ యాప్ డౌన్లోడ్ చేసుకోని బుక్ చేసుకోవాలని ఈఎస్ఐ సిబ్బంది సూచిస్తున్నారు. యాప్ వివరాలు పెట్టి ఈఎస్ఐ సిబ్బంది చేతులెత్తేసారు. యాప్ లో ఆప్షన్స్ తెలియక రోగులు ఓపి బుక్ చేసుకోలేకపోతున్నారు. సర్వర్ మొరాయిస్తుండడంతో ఓపి పేపర్ తీసుకోలేకపోతున్నారు. గంటల తరబడి వందలాది మంది రోగులు వేచి వున్నారు.

# ఆర్టీసీ లో రెవెన్యూ పెంచుకోవడానికి అవకాశాలు అన్వేషించాలి మంత్రి పొన్నం

హైదరాబాద్. నవంబర్ 13,

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న కొత్త కాలనీ లకు అనుగుణంగా బస్సు రూట్ లు పెంచేలా స్టడీ చేయండి. సంస్థ రెవెన్యూ పెంచుకోవడానికి అవకాశాలు అన్వేషించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

గురువారం నాడు అయన -ఆర్టీసీ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం లో మాట్లాడారు.

మంత్రి మాట్లాడుతూ కారుణ్య నియామకాల కింద నియమించిన కండక్టర్ ల ప్రొవిజన్ పిరియడ్ 3 సంవత్సరాల నుండి 2 సంవత్సరాలకు తగ్గించేలా పరిశీలించండి. కష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపో లపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. లాభాల్లోకి వచ్చేలా ఆయా డిపోలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. అరంఘార్ లో అధునాతన బస్సు టెర్మినల్ నిర్మాణం కోసం ఆర్టీసీ , పోలీస్ శాఖల భూ బదలాయింపు పై చర్చించాలని అన్నారు.

నగరంలో కొత్త బస్సు డిపో లకు స్థల పరిశీలన చేసి జిల్లా కలెక్టర్ తో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. బస్సు ప్రమాదాలు తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు చేయాలి. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీ లో బస్ టెర్మినల్ ఏర్పాటు ,బస్సు సౌకర్యాల పై అధ్యయనం చేయాలి. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కండక్టర్ లు ,డ్రైవర్లు ఇతర ఉద్యోగులతో జూమ్ సమావేశం నిర్వహిస్తానని అన్నారు.

# 12 వైట్ టెర్రర్ తీగలాగితే..

న్యూఢిల్లీ, నవంబర్ 13,

: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీప మెట్రో స్టేషన్ సమీపంలో నవంబర్ 10, 2025న భారీ పేలుడు జరిగింది. మొదట సాధారణ యాంత్రిక లోపమని భావించిన ఈ ఘటన, దర్యాప్తులో ఆత్మాహుతి బాంబు దాడిగా బయటపడింది. ఈ ఘటనలో ప్రాధాన్యపాత్రధారి కశ్మీర్‌కు చెందిన ఉమర్ నబీ అని అధికారులు గుర్తించారు. ఇక ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టింది. ఇందులో ఉగ్ర కుట్ర, ఆత్మాహుతి కోణం ఉన్నట్లు సమాచారం.ఫరీదాబాద్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న ఉమర్ నబీ కొద్ది రోజులుగా భద్రతా సంస్థల పర్యవేక్షణలో ఉన్నాడు. అతని మిత్రులు పలువురు అదుపులోకి తీసుకోబడ్డారని తెలిసిన వెంటనే, అతడు లాల్‌ఖిల్లా స్టేషన్ వద్ద మూడు గంటలపాటు దాక్కున్నాడు. బయటకు వెళ్లే సమయంలో సడలింపు లేకుండా నడిచిన పేలుడు అతడిని తునాతునకలు చేసింది. ఈ ఘటనతో అతను పనిచేసిన వలయం ఒక పెద్ద నెట్‌వర్క్‌గా బయటపడింది.ఇదిలా ఉంటే భారత సైన్యం కశ్మీర్‌లోని సెక్టార్ 56లో నిర్వహించిన సోదాల్లో పోలీసులు పెద్ద మొత్తంలో అమ్మోనియం నైట్రేట్, గన్స్, టైమర్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 2,900 కిలోల పేలుడు పదార్థం సేకరించడం ఘోర దాడులకు సంకేతమని అధికారులు వ్యాఖ్యానించారు. ఫ్యూయల్ ఆయిల్ కలిపితే దేశవ్యాప్తంగా విధ్వంసం సష్టించే స్థాయిలో ఈ తయారీ ఉందని కేంద్ర ఇంటలిజెన్స్ తెలిపింది.ఎన్ఐఏ దర్యాప్తులో బయటపడిన విషయాలు ఆశ్చర్యపరుస్తున్నాయి. కశ్మీర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆదిల్ అహ్మద్ రాథర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేస్తూ జైష్ ఏ మహ్మద్ కోసం ప్రచార కార్యకలాపాలు నిర్వహించేవాడు. అదుపులోకి తీసుకున్న తర్వాత అతడే ఈ కుట్రకు కీలకమైన డాక్టర్ ముజమిల్ షఖీల్ పేరును బయటపెట్టాడు. తరువాత పుల్వామాకు చెందిన ఆ వ్యక్తిని కూడా పోలీసులు ట్రాక్ చేసి పట్టుకున్నారు. అతని నియంత్రణలో ఉన్న మహిళా విభాగం నాయకురాలు షాహీన్ షహీద్ కూడా అదుపులోకి వచ్చింది. ఆమెకు మార్గదర్శకురాలు పాకిస్తాన్ మహిళ సాదియా అజర్‌గా తెలిసింది, ఆమె మౌలానా మసూద్ అజర్ బంధువు కావడం దర్యాప్తుకు అంతర్జాతీయ కోణం ఇచ్చింది.ఫరీదాబాద్ నుంచి లక్నో, ఢిల్లీ వరకు ఈ నెట్‌వర్క్ విస్తరించి ఉండగా, వాళ్లకు సహకరించిన వ్యక్తి హాఫీజ్ మహ్మద్ అని గుర్తించారు. అతడు ఆయా డాక్టర్లకు



నివాసం ఇచ్చిన వాడు. మొత్తం 56 మంది ఈ కుట్రలో భాగస్వాములుగా గుర్తించబడి అరెస్టయ్యారు. కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు లేవని, వైద్యులు వరకు ఉగ్రవాద మార్గం వైపు మళ్లడం తీవ్ర ఆందోళనగా ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఇక ఉగ్ర కుట్ర ఆపరేషన్ దేశ భద్రతా సంస్థల సమన్వయంతో విజయవంతమైంది. డాక్టర్ ఆదిల్ అహ్మద్ రాథర్ కేసు దర్యాప్తుతో జైష్ నెట్‌వర్క్ ముళ్లను కనిపెట్టడం సాధ్యమైంది. అతని వద్ద లభించిన సమాచారం ఆధారంగా ఉమర్ నబీ పథకం భగ్నమైందని ఇంటలిజెన్స్ అధికారులు చెప్తున్నారు.

## ఆపరేషన్ సింధూర్ 2.0 షురూ...

న్యూఢిల్లీ, నవంబర్ 13

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గత సోమవారం ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 12 మంది భారతీయులు చనిపోయారు. 20 మందికి పైగా గాయపడ్డారు. వీరంతా కూడా ఢిల్లీలో చికిత్స పొందుతున్నారు. వారందరినీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరామర్శించారు.. భూటాన్ పర్యటన నుంచి స్వదేశానికి వచ్చిన ఆయన నేరుగా బాంబు పేలుడు క్షతగాత్రులను పరామర్శించారు.. ఈ సందర్భంగా ఆయన ఉగ్రవాదులకు గట్టి హెచ్చరికలు పంపారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ దారుణానికి పాల్పడిన వారికి కఠిన శిక్ష తప్పదని స్పష్టం చేశారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ మాటలు మాట్లాడిన వెంటనే




జమ్ము కాశ్మీర్ లో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఇండియన్ ఆర్మీ జమ్ము కాశ్మీర్లోని సుమారు 300 ప్రాంతాలలో సెర్చ్ ఆపరేషన్లు మొదలుపెట్టింది. అంతేకాదు జమాత్ ఈ ఇస్లామి అనే ఉగ్రవాద సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తుల గృహాలలో తనిఖీలు చేసిన ఆర్మీ అధికారులు.. ఉగ్రవాదులకు సంబంధించిన కీలక సమాచారాన్ని.. ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వారందరిని కూడా అధికారులు విచారిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విచారణలో ఉగ్రవాదులకు సంబంధించిన కీలక సమాచారాన్ని ఆర్మీ అధికారులు సేకరించినట్టు తెలుస్తోంది. ఆ వ్యక్తుల బ్యాంకు ఖాతాలు.. వాడుతున్న ఫోన్ నెంబర్లు.. ఎవరెవరితో మాట్లాడుతున్నారు.. అనే విషయాలను ఆర్మీ అధికారులు సేకరించారని తెలుస్తోంది.ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ఇండియన్ ఆర్మీ ఇలానే చేసింది.. అత్యంత ఖచ్చితమైన ఆధారాలతో ఆపరేషన్ చేసింది. ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేసింది.. కేవలం ఉగ్రవాదులు మాత్రమే నష్టపోయే విధంగా కూల్చివేతలు చేపట్టింది. దీంతో పాకిస్తాన్లో స్థావరాలు ఏర్పాటు చేసుకొని ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థలు తీవ్రంగా నష్టపోయాయి. ఇప్పుడు కూడా భారత ఆర్మీ అప్పటి మాదిరిగానే దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ 2.0 మొదలైందని.. ఉగ్రవాద దేశంపై దాడి షురూ అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.భూటాన్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉగ్రవాదులకు సూటిగా.. స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఆయన స్వదేశానికి రాగానే పరిస్థితి మారిపోయింది. ఇండియన్ ఆర్మీ జమ్మూ కాశ్మీర్ మొత్తాన్ని జల్లెడ పడుతోంది. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించి వదిలేస్తోంది. అంతేకాదు సున్నితమైన ప్రాంతాలలో నిఘా ను మరింత పటిష్టం చేసింది.

## రష్మికకు అందరి ముందే పబ్లిక్ గా ముద్దు

హైదరాబాద్, నవంబర్ 13,

సోషల్ మీడియా లో ప్రస్తుతం ఎక్కడ చూసిన విజయ్ దేవరకొండ,రష్మిక నే కనపడుతున్నారు. వీళ్లిద్దరికి రీసెంట్ గానే నిశ్చితార్థం జరిగిందని, వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో పెళ్లి కూడా చేసుకోబోతున్నారని ఇలా ఎన్నో రకాల వార్తలు సోషల్ మీడియా లో ప్రచారం అయ్యాయి. ఈ వార్తలపై వీళ్లిద్దరు ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు కానీ, పరోక్షంగా సోషల్ మీడియా లో ప్రచారం అయ్యేవి నిజమే అని సందర్భం దొరికినప్పుడల్లా చెప్పకనే చెప్తున్నారు. రీసెంట్ గానే రష్మిక ప్రధాన పాత్రలో నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్'అనే చిత్రం ఎలాంటి అంచనాలు లేకుండా సైలెంట్ గా రిలీజ్ అయ్యి బాక్స్ ఆఫీస్ వద్ద బంపర్ హిట్ గా నిల్చింది. మొదటి వారం కూడా పూర్తి కాకముందే బ్రేక్ ఈవెన్ మార్కుని అందుకున్న ఈ సినిమాకు సంబంధించిన సక్సెస్ ఈవెంట్ ని నిన్న హైదరాబాద్ లో ఏర్పాటు చేసారు.ఈ సక్సెస్ మీట్ కి విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా పాల్గొన్నాడు. ఒక స్టార్ హీరో సక్సెస్ ఈవెంట్ అంటే ఆడియన్స్ ఎంతలా ఎదురు చూసారో, ఈ ఈవెంట్ కి కూడా ఆడియన్స్ అంతలా ఎదురు చూసారు. ఎందుకంటే త్వరలో పెళ్లి చేసుకోబోతున్న జంట, ఈ ఈవెంట్ సాక్షిగా తమ పెళ్లి గురించి అధికారిక ప్రకటన చేస్తారేమో అని అనుకున్నారు. అయితే అలాంటిదేమి జరగలేదు కానీ, వీళ్లిద్దరి మధ్య జరిగిన కొన్ని క్యూట్ మూమెంట్స్ కి సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. విజయ్ దేవరకొండ ఈవెంట్ కి రాగానే అందరినీ పలకరించుకుంటూ ముందుకు వెళ్ళాడు. ఇక రష్మిక అయితే స్వయంగా విజయ్ ని పలకరించేందుకు ముందుకు వెళ్ళింది. అప్పుడు విజయ్ రష్మిక చేతిని ముద్దాడడం ఇప్పుడు సోషల్ మీడియా లో హాట్ టాపిక్ గా మారింది. అందుకు సంబంధించిన వీడియో ని మీరు క్రింద చూడవచ్చు.అంతే కాదు, విజయ్ దేవరకొండ ఈవెంట్ కి రాకముందు, రష్మిక ఈవెంట్ లోకి అడుగుపెట్టిన తర్వాత కొంతమంది అభిమానులు ఒక రేంజ్ లో కేరింతలు చేశారు. ఒక అభిమాని అయితే ధైర్యం చేసి 'రష్మిక దేవరకొండ' అని గట్టిగా పిలుస్తాడు. దానికి రష్మిక వెనక్కి తిరిగి చూసి, 'వామ్మో ఏంట్రా మీరు ఇలా ఉన్నారు' అని నవ్వుతూ సిగ్గు పడుతుంది. ఇలా వీళ్లిద్దరు అధికారికంగా పెళ్లి గురించి ఎలాంటి కామెంట్స్ చేయకపోయినప్పటికీ కూడా, ఇలాంటి క్యూట్ మూమెంట్స్ ద్వారా తాము త్వరలోనే ఒక్కటి కాబోతున్నాం అంటూ చెప్పకనే చెప్తున్నారు. అదే విధంగా నిన్నటి ఈవెంట్ లో విజయ్ దేవరకొండ, రష్మిక ఒకరిని ఉద్దేశించి ఒకరు మాట్లాడడం హైలైట్ గా నిల్చింది.

## ఉగ్రవాదులుగా మహిళలు! జైష్ మహమ్మద్ కుట్ర అదే..

న్యూఢిల్లీ, నవంబర్ 13,

ఉగ్రవాదం.. ఈ ఉన్మాదమైన చర్యకు కేవలం మగవాళ్ళు మాత్రమే పాల్పడతారనే విషయం అందరికీ తెలుసు. ఉగ్రవాదులు కేవలం మగవాళ్ళు మాత్రమేనని.. వారు మాత్రమే అత్యంత కరుడుగట్టిన వ్యక్తిత్వంతో ఉంటారని.. సాటి మనుషులను అత్యంత దారుణంగా చంపేస్తారని అందరికీ తెలిసిందే. గతంలో జరిగిన సంఘటనలు.. ఇటీవల కాలంలో చోటు చేసుకున్న పరిణామాలు కూడా వీటినే నిరూపించాయి. ఇప్పుడు ఉగ్రవాదంలోకి ఆడవాళ్లు కూడా వస్తున్నారు. ముఖ్యంగా భారత్ అంటే తీవ్రస్థాయిలో మండిపడే జైష్ ఏ మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థ ఆడవాళ్లను ఉగ్రవాదులుగా మార్చుతోంది. వారిని వైట్ కాలర్ ఉగ్రవాదులుగా రూపొందించి మన దేశం మీదకి వదులుతోంది. ఢిల్లీ ఘటన తర్వాత.. మన దేశ పోలీసులు ఇద్దరు మహిళా టెర్రరిస్టులను అరెస్ట్ చేసిన తర్వాతగ్గ్భాంతికరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.జైషే మహమ్మద్ సంస్థ భారత దేశంలో ఉగ్ర కార్యకలాపాలను మరింత విస్తరించడానికి మహిళలను రంగంలో విధించుతోంది. ఐసిస్, బోకోహారం, హమాస్, ఎల్టీటీఈ వంటి సంస్థలు ఆత్మహుతి దాడులకు మహిళలను ఉపయోగిస్తాయి. లష్కర్ ఏ తోయిబా, జై ష్ ఏ మహమ్మద్ వంటి సంస్థలు మాత్రం మహిళలకు ఇటువంటి అవకాశాన్ని ఇవ్వవు. వారిని కేవలం పడక సుఖం కోసం మాత్రమే ఉపయోగించుకుంటాయి. కానీ ఈసారి జై ష్ ఏ మహమ్మద్ అనే సంస్థ మాత్రం తన మార్గాన్ని మార్చుకుంది.. ఈ సంస్థ అధినేత మసూద్ అజర్ సోదరుడు తల్హా విభిన్నంగా ఆలోచించడం మొదలుపెట్టాడు. అతడి ఆదేశాల మేరకే యుద్ధ రంగంలోకి మహిళలను తీసుకోవడం మొదలుపెట్టారు. ఉగ్ర కార్యకలాపాలు సాగించే మహిళలకు "జమాత్ ఉల్ మోమినత్ " అనే పేరు పెట్టారు. ఈ దళానికి జైష్ అధినేత మసూద్ సోదరి సాదియా అజర్ నాయకత్వం వహిస్తోంది. ఇప్పటికే ఈ దళంలో ఉగ్రవాదుల భార్యలు చాలామంది చేరిపోయారు. వీరంతా కూడా ఆత్మాహుతి దాడులకు నేతృత్వం వహించే దిశగా శిక్షణ పొందినట్టు తెలుస్తోంది. వీరు ఇతర మహిళలకు కూడా శిక్షణ ఇస్తున్నట్టు సమాచారం. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా భారత దళాలు పాకిస్థాన్లో జైష్ ఉగ్రవాద సంస్థ కార్యాలయాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో సాదియా భర్త కన్నుమూశాడు. అప్పటినుంచి ఆమె భారత్ మీద తీవ్రస్థాయిలో ద్వేషం పెంచుకుంది. అందువల్లే పేద మహిళలను తన బృందంలో చేర్చుకుంటున్నది.పాకిస్తాన్లోని బహవల్పూర్, కరాచీ, హరీ పూర్, ముజఫర్బాద్, కోట్లి, మాన్సిరా వంటి ప్రాంతాలలో ఉన్న మహిళలను తన బృందంలోకి చేర్చుకుంటున్నది. సోషల్ మీడియా, వాట్సప్, ఇతర మార్గాల ద్వారా రిక్రూట్ చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. జమ్ము కాశ్మీర్, యూపీలో ఉన్న పేద ముస్లిం మహిళలను లక్ష్యంగా చేసుకొని తన ఉగ్రవాద దళంలోకి తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఫరీదాబాద్ ప్రాంతంలో పోలీసులకు చిక్కిన ఇద్దరు మహిళ ఉగ్రవాద డాక్టర్లు ఈమె దళానికి చెందిన వారిని తెలుస్తోంది. ఇంటెలిజెన్స్ వర్గాలకు పూర్తిస్థాయిలో సమాచారం ఉండడంతో మహిళా ఉగ్రవాదులపై కన్నేసినట్టు తెలుస్తోంది.

# మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ సరిహద్దు ఆవాసం కోసం పులుల సంచారం..!

అదిలాబాద్, నవంబర్ 13,

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల్లో పెద్దపులుల సంచారం అలజడి కలకలం రేపుతున్నాయి. మహారాష్ట్ర సరిహద్దులోని తిప్పేశ్వర్ పులుల అభయారణ్యం నుండి పెన్ గంగానదీ తీరం దాటి తెలంగాణ సరిహద్దు దాటి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశిస్తూ రైతుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. అటు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దుల్లో తడోబా అభయారణ్యం నుండి జిల్లాలోకి పులులు సంచరిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఇక్కడే తిష్టవేసి పశువులు, మేకల గుంపులపై దాడి చేసి హతమారుస్తున్నాయి.కొన్ని రోజుల క్రితం ఆదిలాబాద్ భీంపూర్ మండలంలోని సరిహద్దు గ్రామాల్లో పత్తి చేనులో పులి కనిపించింది. కొందరు రైతులు ధైర్యంగా సెల్ ఫోన్ లో పులి ఫోటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అక్కడి పరిసర ప్రాంతాల్లో పులి కదలికలతో పత్తి ఏరే రైతులు కూలీలు భయాందోళనకు గురయ్యారు. పొలాల్లో రైతులు టపాసులు కాల్చి పనులు చేస్తున్నారు. అక్కడ నుంచి వెళ్ళిన పులి సరిహద్దులో గల బోథ్ మండలంలోని నిగిని, కంటెగాం, రఘునాథ్ పూర్, అజ్జర్, వజ్జర్, చింతల్ బోరి, దేద్రా అటవీ శివారు గ్రామాల్లో సంచరిస్తోంది. అయితే పెద్దపులి అలికిడికి గ్రామాలన్ని వణికిపోతున్నాయి.సరిహద్దు మహారాష్ట్రలోని చికిలి, శివిని, డాంకి, ఈసాపూర్, ఘన్ పూర్ మీదుగా ఓ ఆడపులి సంచరిస్తూ రైతుల్లో హడలెత్తిస్తుంది. అయితే పెంపుడు జంతువులైన ఆవులు, గేదెలు, మేకలను ఈ పెద్దపులి వేటాడి చంపినప్పుడే పులిజాడ నీడలు బయటపడుతున్నాయి. సామాన్య ప్రజలు, రైతులు పత్తి పంట చేనులోకి వెళ్లి పలు సందర్భాల్లో పెద్దపులిని చూసి బీతిల్లిపోవడం ఈవిషయాన్ని అటవీ అధికారులకు సమాచారం అందించడం జరుగుతుంది. ఇదివరకే సరిహద్దులోనీ కంటెగాం, రఘునాథ్ పూర్, నిగిని ప్రాంతాల్లో అటవీ సిబ్బంది పెద్దపులి కదలికలపై అన్వేషణ సాగిస్తూ పాదముద్రలు సేకరిస్తున్నారు. మరోవైపు అటవీ శాఖ అధికారులు పులి పాదముద్రలు సేకరించి ట్రాప్ కెమెరాలను పెట్టీ పులి కదలికలపై నిఘా పెంచారు.



రైతులు మాత్రం ఉదయం సాయంత్రం పూటల్లో పంట చేలకు వెళ్లవద్దని, పగలు వెలుతురున్నప్పుడు పంట చేలకు గుంపులు గుంపులుగా వెళ్లాలని, పెద్దపులి కనిపిస్తే అరుపులు కేకలతో హడావుడి చేయాలని ఆటవీ అధికారులు సూచిస్తున్నారు. ఈ విషయమై బోథ్ అటవీశాఖ రేంజ్ అధికారి ప్రణయ్ పులి సంచారం వాస్తవమేనన్నారు. ప్రతీ ఏటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల్లో పెద్దపులి సంచరించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మాసాల్లోనే మేటింగ్ కోసం అనువైన వాతావరణం ఉంటుందన్నారు. పులి ఆవాసం కోసం ఈ ప్రాంతానికి తరచూ వస్తూ పోవడం ఈ కాలంలో శరమాములేనని, వ్యవసాయ పనుల్లో ఉండే కూలీలు రైతులు అప్రమత్తంగా ఉండేలా వారికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పులి కదలికలపై ఎప్పటికప్పుడు పాదముద్రలు సేకరించి ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని పులి సంచరించే ప్రాంతాల్లో రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండి గుంపులు గుంపులుగా ఉండాలన్నారు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ పనులు చేసుకుని వెళ్లాలని పులికి ఎలాంటి హాని చేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అయితే ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని సరిహద్దు అటవీ ప్రాంతంలో ఆడపులి జిల్లాలోని భీంపూర్ మండల సరిహద్దుల్లోనీ అటవీ ప్రాంతంలో మగపులి కదలికలు మేటింగ్ కోసమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఆవాసానికి అనువైన ప్రదేశం కావడంతో తిప్పేశ్వర్ అభయారణ్యం దాటి జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయన్నాయి. ఇటీవల భీంపూర్ మండలంలోని తాంసి (కె) గ్రామ శివారులో గొంటిముక్కల అశోక్ పత్తి చేనులో పెద్దపులిని చూసి పరుగు పరుగున గ్రామానికి చేరుకున్నారు. పులి కదలికలను పసిగట్టి సెల్ ఫోన్ లో చిత్రీకరించారు. తాంసి (కె)గొల్లఘాట్, అర్లి, భగవాన్ పూర్ వడగాం, సరిహద్దు గ్రామాల్లో మగపులి చేస్తుంది. పత్తి, సోయాబిన్ రైతులు పంట చేతికి వచ్చే దశలో చేనుకు వెళ్లా లంటేనే భయంతో వణికిపోతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆవాసం అనువుగా ఉండటం, మరోవైపు వణ్య ప్రాణుల సంఖ్య పెరుగడంతో పెద్దపులుల రాకపోకలు ఈ ప్రాంతాల్లో పెరిగిపోయాయి.అటు కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికల్ పేట్, కౌటాల, దేహేగాం, కాగజ్ నగర్ అటవీ ప్రాంతాల్లోనూ పెద్ద పులులు సంచరిస్తున్నాయి. పులులు సంచరించే ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు పాదముద్రలను సేకరిస్తూ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తూ రైతులు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో డప్పు చాటింపు సైతం నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

# రాజీకొస్తున్న వర్మ...

హైదరాబాద్, నవంబర్ 13,

దర్శకుడు రామ్ గోపాల్ వర్మలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా ఆయన వ్యవహార శైలిలో మార్పు వచ్చింది. ఇండియన్ సినిమా ఇండస్ట్రీ గుర్తించిన దర్శకుడు వర్మ. తొలుత తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. తరువాత బాలీవుడ్ లో సైతం తన దర్శకత్వ ప్రతిభను నిరూపించుకున్నారు. అటువంటి వర్మ పొలిటికల్ లైన్ లోకి వెళ్లారు. వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డిని మెప్పించేందుకు పొలిటికల్ సెటైరికల్ మూవీలు తీశారు. అంతటితో ఆగకుండా జగన్మోహన్ రెడ్డి రాజకీయ ప్రత్యర్థులను సైతం సోషల్ మీడియాలో ఇబ్బంది పెట్టారు. ఒక పేరు మోసిన దర్శకుడు నన్న విషయాన్ని హాలీవుడ్ స్థాయిలో చిల్లర వేషాలు వేశారు. తనను తాను తగ్గించుకున్నారు. ఒక క్రియేటివ్ డైరెక్టర్ గా పేరు పొందిన ఆయన వివాదాస్పదముద్ర వేసుకున్నారు. ఇప్పుడు దాని నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నట్టుగా ఉన్నారు. అందులో భాగంగా మెగాస్టార్ చిరంజీవికి క్షమాపణలు చెప్పారు. రామ్ చరణ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేకంగా అభినందించారుతెలుగు చిత్ర పరిశ్రమలో శివ సినిమా ద్వారా ప్రవేశించారు రాంగోపాల్ వర్మ. నాగార్జునకు ఒక విజయవంతమైన సినిమా అందించగలిగారు. తెలుగు సినిమా ట్రెండ్ ను మార్చారు రామ్ గోపాల్ వర్మ. అనతి కాలంలోనే వైవిధ్య భరితమైన సినిమాలకు దర్శకత్వం అందించి తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. తన ప్రతిభ కేవలం తెలుగుకే కాదు.. హిందీ భాషలో సైతం అద్భుత విజయాలను దక్కించుకొని ఇండియన్ సినిమా హిస్టరీలో తన పేరును నిలుపుకున్నారు. కానీ అటువంటి దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తప్పటడుగులు వేశారు. రాజకీయాల వైపు దృష్టి మళ్లించారు. అలాగని నేరుగా కాదు. జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా నిలిచి సినిమాలు తీశారు. ఈ క్రమంలో సోషల్ మీడియా వేదికగా చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ ను తూలనాడారు. మెగా ఫ్యామిలీ పై విరుచుకుపడేవారు. అటువంటి ఆర్జీవి లో ఇప్పుడు స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుల్ సైలెంట్ అయ్యారు రాంగోపాల్ వర్మ. కేసులను సైతం ఎదుర్కొని ఒకానొక దశలో అరెస్టు అవుతారని ప్రచారం నడిచింది. స్టేషన్ల చుట్టూ తిరుగుతూ.. కోర్టుల ద్వారా ఉపశమనం పొందారు. అయితే ఈ క్రమంలో రాంగోపాల్ వర్మ రాజీ పడ్డారన్న ప్రచారం నడిచింది. అందుకే కూటమి ప్రభుత్వం ఆయన విషయంలో వెనక్కి తగ్గినట్లు టాక్ నడిచింది. అయితే తాజాగా మెగాస్టార్ చిరంజీవికి ఏకంగా క్షమాపణలు చెప్పారు. మంచి మనిషిగా అభివర్ణించారు. ఆయన కుమారుడు రామ్ చరణ్ విషయంలో అడ్డగోలుగా మాట్లాడే ఆయన.. ఫస్ట్ టైం అభినందించారు. కచ్చితంగా తెర వెనుక ఏదో జరిగిందన్న అనుమానాలు ఉన్నాయి.

## జూబ్లీ ఓటమి ఎఫెక్ట్...

# నామమాత్రంగా మిగిలిన కమలం

హైదరాబాద్, నవంబర్ 13

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ వాతావరణం తారస్థాయికి చేరుకుంది. పోలింగ్ అనంతరం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ పార్టీ వార్ రూమ్‌లలో నూతన చర్చలకు దారితీశాయి. చాలా సర్వేలు కాంగ్రెస్ అభ్యర్థికి ఊతం ఇచ్చి, బీఆర్ఎస్‌కు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గెలుపోటములు ఎవరిపై ప్రభావం చూపుతాయన్న చర్చ కూడా జరుగుతోంది. ప్రతిష్ఠాత్మక ఉర్దూ మీడియా సంస్థ 'సియాసత్' వెల్లడించిన అంచనా ప్రకారం కాంగ్రెస్ ఓటింగ్ శాతం 48గా, బీఆర్ఎస్ 42గా నమోదైంది. ఇదే సమయంలో 'డెక్కన్ క్రానికల్' మాత్రం బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపింది. రెండు అంచనాలు భిన్నంగా ఉన్న నేపథ్యంలో తుది ఫలితాలను ఊహించడం కష్టతరంగా మారాయి. ఈసారి జూబ్లీహిల్స్‌లో ఓటింగ్ శాతం 50 దాటకపోవడం కీలకంగా మారింది. సాధారణంగా తక్కువ పోలింగ్ అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తుంది. వ్యతిరేకత ఉన్నప్పుడు ఎక్కువ ఓటింగ్ నమోదవడం విపక్షానికి అనుకూలంగా ఉంటుంది. తాజాగా పోలింగ్ కాంగ్రెస్ ఉత్సాహాన్ని బీఆర్ఎస్‌లో టెన్షన్ పెంచింది. ఈ ఉప ఎన్నికలో బీజేపీ నామమాత్రంగా పోటీ చేసినప్పటికీ, ప్రభావం పరిమితంగానే కనిపించింది. 2023లో 3.6 శాతం ఓటు పొందిన ఈ పార్టీ, ఈసారి 6 నుంచి 7 శాతం వరకు పెరగవచ్చని సర్వే సంస్థలు సూచించాయి. అయినా, ప్రధాన పోరు కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ మధ్యే సాగిందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయిముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ పోరులో తన వ్యక్తిగత ప్రతిష్ఠను పణంగా పెట్టారు. అజారుద్దీన్‌కు మంత్రిపదవి ఇచ్చిన నిర్ణయం కూడా వ్యూహాత్మకంగా భావిస్తున్నారు. ప్రత్యేకంగా ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీతో రేవంత్ చర్చించి ముస్లిం ఓట్లు కాంగ్రెస్ వైపు మళ్లేలా చేశారు. గత ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న నవీన్ యాదవ్ ఈసారి పోటీ చేయకపోవడం ఆ వ్యూహానికి అనుకూలమైంది. బీఆర్ఎస్ ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మాగంటి సునీత అభ్యర్థిత్వం, ప్రచారం ఇవన్నీ కేటీఆర్ సమన్వయంతో జరిగాయి. అయితే ఫలితాలు ప్రతికూలంగా రాకుండా ఉండాలనే భయం పార్టీలో కనిపిస్తోంది. కేటీఆర్ భవిష్యత్ రాజకీయ భూమికను ఈ ఫలితం ప్రభావితం చేయవచ్చని పార్టీ వర్గాల అభిప్రాయం. ఓటమిని ముందే ఊహించిన గులాబీ బాస్ కేసీఆర్.. సునీతకు



ఓటు వేయమని కనీసం ప్రకటన కూడా విడుదల చేయలేదు. జూబ్లీహిల్స్‌లో ఇంతవరకు కాంగ్రెస్ విజయం సాధించిన సందర్భం లేదు. టీడీపీ, బీఆర్ఎస్‌లు మాత్రమే వరుసగా గెలిచాయి. ఈసారి కాంగ్రెస్ విజయవంతమైతే, రేవంత్‌రెడ్డి రాజకీయ బలం కొత్త దిశగా మార్పు అవుతుంది. ఇది భవిష్యత్తు తెలంగాణ రాజకీయ సమీకరణాలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

# కొత్త రైల్వే లైన్‌కు లైన్ క్లియర్

మహబూబ్ నగర్, నవంబర్ 13,

మహబూబ్‌నగర్– డోన్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. త్వరలోనే భూసేకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైళ్ల రాకపోకలు మెరుగుపడటంతో పాటు సరకు రవాణా సామర్థ్యం పెరిగి, దక్షిణ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది. ప్రయాణికులకు శుభవార్త. మహబూబ్‌నగర్– డోన్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి. ఈ కీలక ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం బుధవారం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రైల్వే చట్టం, 1989లోని సెక్షన్ 20ఏ ప్రకారం.. ఈ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కోసం భూములు ప్రజా ప్రయోజనాలకు అత్యవసరం అని కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. ఈ నిర్ణయం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో అవసరమైన భూములను సేకరించేందుకు రైల్వే శాఖకు అధికారికంగా మార్గం సుగమమైంది. నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి 30 రోజుల వ్యవధిలోగా భూముల యజమానులు తమ అభ్యంతరాలను రాతపూర్వకంగా సమర్పించవచ్చు. ఈ అభ్యంతరాలను సంబంధిత రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, మహబూబ్‌నగర్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. సమర్పించిన అభ్యంతరాలు, ఇతర వివరాలను అధికారులు పూర్తిగా సమీక్షించిన తర్వాతే భూసేకరణపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా, చట్టబద్ధంగా పూర్తి చేయాలని రైల్వే శాఖ ఆదేశించింది. మహబూబ్‌నగర్–డోన్ మార్గం దక్షిణ భారతదేశంలోని ముఖ్యమైన రైల్వే కారిడార్లలో ఒకటి. ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతుంది. సింగిల్ లైన్ కావడం వల్ల ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు జాప్యం జరిగేది, ముఖ్యంగా రద్దీ సమయాల్లో రైళ్లు గంటల తరబడి నిలిచిపోయే పరిస్థితి ఉండేది. దక్షిణ మధ్య రైల్వే తెలిపిన వివరాల



ప్రకారం.. ఈ డబ్లింగ్ ప్రాజెక్టు ముఖ్యంగా రెండు ప్రధాన లక్ష్యాలను సాధించడానికి ఏర్పాటు చేస్తున్నారు. డబ్లింగ్ పూర్తయితే ఈ మార్గంలో అదనపు ప్యాసింజర్ రైళ్లను నడపవచ్చు. ప్రస్తుతం ఉన్న రైళ్ల ప్రయాణ సమయం తగ్గుతుంది. వేగంగా, సమయానికి రైళ్లు గమ్యస్థానాలకు చేరుకోగలుగుతాయి. ఈ మార్గం ద్వారా బొగ్గు, సిమెంట్, ఆహార ధాన్యాల వంటి సరకు రవాణా జరుగుతుంది. డబ్లింగ్‌తో సరకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది, తద్వారా స్థానిక పరిశ్రమలకు, వాణిజ్య కార్యకలాపాలకు ఊతం లభిస్తుంది. ఈ ప్రాజెక్టు మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు దక్షిణ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది. మెరుగైన రైలు కనెక్టివిటీ వల్ల ఈ ప్రాంతంలో పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ డబ్లింగ్ పనులు పూర్తయితే.. దక్షిణ భారతం వైపు వెళ్లే రైల్వే నెట్‌వర్క్ మరింత పటిష్టమవుతుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు.

# స్థానిక సమరానికి సై...

హైదరాబాద్, నవంబర్ 13,

: స్థానిక ఎన్నికలు పెట్టాలనుకున్నారు. నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. కట్ చేస్తే రిజర్వేషన్ల పీటముడితో..బీసీ కోటా జీవో, ఎన్నికల నోటిఫికేషన్ రెండూ రద్దయ్యాయి. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చినట్లు అయ్యింది. ఇప్పుడు జూబ్లీహిల్స్ బైపోల్ కాంగ్రెస్‌లో మళ్లీ ఆశలు రేకెత్తిస్తోంది. ఇన్నాళ్లు గ్రౌండ్‌లో పరిస్థితులు ఉలా ఉన్నాయన్న ఆందోళన ఉండేది. యూరియా ఇవ్వలేదని రైతులు కోపంగా ఉన్నారన్న టాక్..రైతు భరోసా నిధులు జమ చేయడంలో ఆలస్యం..ఆరు గ్యారెంటీల అమలు కాకపోవడంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం ఉంది. కానీ జూబ్లీహిల్స్‌లో గెలిస్తే అదంతా సైడ్ అయిపోయినట్లేనని భావిస్తోందట అధికార కాంగ్రెస్. జూబ్లీహిల్స్ రిజల్ట్ వచ్చిన తర్వాత..ఆ గెలుపు జోష్‌లో స్థానిక ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేందుకు రెడీ అవుతోందట సర్కార్. అయితే రిజర్వేషన్లను 50శాతం మించకుండా చూడాలని హైకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు మించకుండా చూస్తే.. బీసీలకు 23 శాతం మాత్రమే రిజర్వేషన్లు దక్కుతాయి. అలా చేస్తే అసెంబ్లీ ఎన్నికలప్పుడు బీసీలకు ఇచ్చిన హామీ 42శాతం రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకునే పరిస్థితి లేదు. బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్ల కోసం చేసిన ప్రయత్నాలేవీ వర్కౌట్ కాలేదు. మరోవైపు స్థానిక ఎన్నికలను పెట్టాలని..గ్రామాల్లో పరిపాలన పడకేయడం సరికాదంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారో చెప్పాలంటూ అల్టిమేటం జారీ చేసింది. కోర్టు ఆదేశాలతో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల విషయంలో పాత పద్దతిని ఫాలో కావాలనే ఆలోచనకు ప్రభుత్వం వచ్చిందట. పాత పద్దతిలో 50శాతానికి రిజర్వేషన్లు మించకుండా జీవో ఇచ్చి..మిగతా రిజర్వేషన్లను పార్టీపరంగా ఇంప్లిమెంట్ చేయాలని డిసైడ్ అయ్యిందట. పాత పద్దతిలో ఎన్నికల నిర్వహణ కోసం త్వరలో క్యాబినెట్ భేటీలో డెసిషన్ తీసుకుంటారని అంటున్నారు. వాస్తవానికి 12వ తేదీన క్యాబినెట్ సమావేశం నిర్వహించాలని భావించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మంత్రులు బిజీగా గడపడంతో..రెండు రోజులు ఆగి రిజల్ట్ వచ్చాక మంత్రివర్గ భేటీ ఉండబోతందట. జూబ్లీహిల్స్‌లో కచ్చితంగా గెలుస్తామని ధీమాగా ఉండటంతో..ఫలితాలు వచ్చిన తర్వాత క్యాబినెట్ సమావేశం నిర్వహించి ..స్థానిక సమరంపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తోందట అధికార పార్టీ. అంతా అనుకున్నట్లుగా జరిగితే డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు పెట్టబోతున్నారట. ఈ సారైనా లోకల్ బాడీ పోల్స్ జరిగేనా..లేక మళ్లీ ఏమైనా చిక్కులు వచ్చిపడుతాయో వేచి చూడాలి మరి.

# అప్పుడే చలి చంపేస్తోంది....

హైదరాబాద్, నవంబర్ 13,

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రాబోయే వారం రోజులు ఇదే తరహా చలి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ ఫ్లూ లక్షణాలపై జాగ్రత్త వహించాలని వైద్యారోగ్యశాఖ సూచించింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత గణనీయంగా పెరగడంతో ప్రజలు గజ గజ వణికిపోతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో దీని ప్రభావం అధికంగా ఉంది. కొమురం భీం– ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ)లో మంగళవారం రాత్రి అత్యంత కనిష్ఠంగా 10.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్ శేరిలింగంపల్లి హెచ్‌సీయూ ప్రాంతంలో 14.8 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఉదయం పొగమంచు, చలిగాలులు, రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో సగటున 4 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పడిపోయాయని తెలిపారు. ఈ నెలలో సగటు ఉష్ణోగ్రతలు 13 నుంచి 17 డిగ్రీల మధ్య కొనసాగే అవకాశం ఉందన్నారు. రాబోయే వారం రోజులు ఇదే తరహా చలి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురం భీం– ఆసిఫాబాద్, నల్గొండ, భద్రాచలం, రామగుండం, రంగారెడ్డి, యాదాద్రి–భువనగిరి, పటాన్‌చెరు, నిజామాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ శివారు హయత్‌నగర్ ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 26 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉన్నా.. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రం అత్యల్పానికి పడిపోతాయన్నారు. చాలా ప్రాంతాల్లో 16 డిగ్రీలకు తగ్గే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ (డీహెచ్) రవీందర్ నాయక్ తెలిపారు. రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్లు, సీజనల్ ఫ్లూ పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జ్వరం, దగ్గు, గొంతు తడి ఆరిపోవడం, నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లను వెంటనే కలవాలన్నారు. గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులు, వృద్ధుల్లో సీజనల్ ఫ్లూ లక్షణాలు లేదా అధిక జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలన్నారు.

## ఆంధ్రప్రదేశ్, యూరప్ బిజినెస్ పార్ట్నర్షిప్ రౌండ్టేబుల్ ఆసక్తికర సంభాషణ

విశాఖపట్నం నవంబర్ 13,

దాదాపు చంద్రబాబు నాయుడు వయసు వున్న ఈయూ ప్రతినిధి మైకందుకుని

"మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే ఈయూ కంపెనీల క్లస్టర్లు ఉన్నాయి. అయితే, ఆంధ్రప్రదేశ్కు రావడానికి వారిని ఒప్పించడానికి మీరు వారికి ఏమి చెబుతారు? వారికి ఇప్పటికే అనుభవం ఉన్న ఇతర రాష్ట్రాలకు కాకుండా, ఏపీని ఎందుకు ఎంచుకోవాలో మీరు ఏ విధంగా భరోసా ఇస్తారు?" అంటూ ప్రశ్నను సంధించారు.

చంద్రబాబు నాయుడు మైక్ తీసుకుని చిరునవ్వుతో జవాబివ్వడం మొదలుపెట్టారు!

"మీ ఎక్సలెన్సీ, ధన్యవాదాలు. మేము సహకార సమాఖ్య వ్యవస్థలో ఉన్నాం. ఇక్కడ రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలి. ఇది నాకు కొత్త కాదు. గతంలో కూడా నేను ఇలాగే పోటీ పడేవాడిని. ఒకప్పుడు, బెంగళూరు దేశానికి ఐటీ రాజధానిగా ఉండేది. అప్పుడు నేను పోటీపడి, హైదరాబాద్కు దాన్ని తీసుకురావడానికి ప్రయత్నించాను. ఇప్పుడు చూడండి, ఆ పోటీ కారణంగానే, హైదరాబాద్ బెంగళూరు కంటే మెరుగైన రేటింగ్ను పొందింది" అనంగానే.. సభలో చప్పట్లు మ్రోగాయి.

చంద్రబాబు కొనసాగిస్తూ "దావోస్లో కూడా మేము ఇలాగే పోటీ పడేవాళ్ళం. ఒకానొక దశలో, అప్పటి ముఖ్యమంత్రి ఎస్.ఎం. కృష్ణ గారు నాతో అన్నారు, 'నేనిక మీతో పోటీ పడలేను. మనం ఇద్దరం కలిసి పని చేద్దాం.'అప్పుడు నేను అన్నాను, 'ఎక్సలెంట్! కలిసి పని చేద్దాం. భారతదేశం ఒక్కటే. మనం కలిసి దేశాన్ని ముందుకు తీసుకెళ్దాం.' నాకు చాలా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది, మీ ఎక్సలెన్సీ. నేను నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశాను. సంస్కరణల మొదలుకొని టెక్నాలజీ వరకు, ప్రస్తుతం వరకూ.. ప్రతిదీ నేను చూశాను. నేనొక విషయం చెప్పగలను: మనం ఇప్పుడు చాలా, చాలా స్ఫూర్తిదాయకమైన సమయంలో ఉన్నాము" అని చంద్రబాబు జవాబు ఇవ్వంగానే సమావేశంలో సానుకూల స్పందన వ్యక్తం అయ్యింది.

## ఆర్టీసీ బస్సులో పొగలు

గద్వాల జోగులాంబ గద్వాల జిల్లా మానపాడ్ మండలం మద్దూరు స్టేజ్ సమీపములో అయిజ నుండి కర్నూలు వెళ్ళే బస్సు టైర్లో పొగలు వ్యాపించాయి. దానిని గమనించిన ప్రయాణికులు అరుపులు,కేకలు వేశారు.. బస్సు కిటికిల ద్వారా కిందికి దిగి ప్రయాణికులు పారిపోయారు. (

## పేరంచర్ల తెల్ల క్వారీ కార్మికుల ఆందోళన

గుంటూరు వంబర్ 13

ఇబ్రహీంపట్నం లో రాష్ట్ర మైనింగ్ కార్యాలయం వద్ద పేరంచర్ల తెల్ల క్వారీ కార్మికులు ఆందోళనకు దిగారు. క్వారీ కి వెళ్ళనీయకుండా స్థానిక బడా బాబు అడ్డుకుంటాడని ఆందోళన దిగారు. పుస్తెలు తాకట్టు పెట్టి క్వారీ లీజుకు 40 లక్షలు కట్టి నష్టపోయామని వాపోతున్నారు. 13 నెలల నుండి క్వారీ కి వెళ్లకుండా పివిఆర్ అనే వ్యక్తి అడ్డుకుంటున్నారని ఆందోళనకు దిగారు. అక్రమంగా క్వారీలో మైనింగ్ చేస్తూ తమను తమ క్వారీకి వెళ్ళనీకుండా అడ్డుకుంటున్నాడని చెబుతున్నారు. క్వారీకి కార్మికులకు అండగా వడ్డెర కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నిరసన తెలుపుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని ముఖ్యమంత్రి, మనీ శాఖ మంత్రి స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. బాధితులు తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం అని వాపోతున్నారు.

## రాష్ట్రంలో ఉగ్రజాడల కోసం ఏటీఎస్ గాలింపులు

విజయవాడవంబర్ 13

ఆంధ్రప్రదేశ్లో ఉగ్ర జాడల కోసం పోలీసులు జల్లెడపడుతున్నారు. విజయనగరం, విశాఖపట్నం, గుంటూరులో ఉగ్రవాద అనుమానితులపై భారీ సోదాలు నిర్వహించారు. గుంటూరులో స్లీపర్ సెల్స్ ఉన్నాయనే సమాచారంతో ముంబై ఏటీఎస్ ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టింది. గుంటూరులో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై దృష్టి పెట్టారు. ఉగ్ర మూలాలు ఉన్నాయనే అనుమానంతో ఏటీఎస్ విచారణ కొనసాగిస్తోంది. స్థానిక పోలీసులతో సమన్వయంతో గాలింపులు వేగవంతం చేసారు.

## రెండు బైకులు గుద్దుకున్న ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు

నాయుడుపేట:నవంబర్ 13,

–రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాల పాలైన సంఘటన తిరుపతి జిల్లా నాయుడుపేట శ్రీకాళహస్తి బైపాస్ రోడ్ లోని అవని అపార్ట్మెంట్ వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. అవని అపార్ట్మెంట్ ఎదురుగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతున్న ఒక వ్యక్తి చూసుకోకుండా మోటార్ సైకిల్ పై రోడ్డు దాటుతున్న సమయంలో నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి తాల్వాయిపాడు వైపు వెళుతున్న ఇద్దరు యువకులు బైక్ పై అతివేగంగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో హోటల్ యజమానికి తలకి కాలుకి తీవ్ర గాయాలయ్యాయి యువకులు ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చుట్టుపక్కల వాళ్లు అంబులెన్స్ కి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను అంబులెన్స్ లో వైద్యశాలకు తరలించారు.

## ఏ కొండూరు లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొలికపూడి

తిరువూరు నవంబర్ 13,

ఏ.కొండూరు మండలం, ఏ. కొండూరు గ్రామ మార్కెట్ యార్డు లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని శాసన సభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు ప్రారంభించారు. తరువాత ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉండేందుకు, మంచి గిట్టు బాటు ధరకు కొనుగోలు చేసేలా ఈ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

రైతులు కూడా ఈ పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, తేమ తక్కువగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అందరికీ అందుబాటులో ఈ కొనుగోలు కేంద్రాలు ఉండటం వలన రైతులకు ఎంతో సహాయపడుతుందని అన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్‌స్థానిక సంస్థల్లో బిసిలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బిసి జేఏసీ చైర్మెన్ , రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు పోవాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ లతోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ... హైదరాబాద్ బర్కత్ పురా లో విద్యార్థులతో కలిసి ఆర్ కృష్ణయ్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ... 42 శాతం రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం కుల గణన చేపట్టి , చట్టసభలో బిల్లు ఆమోదించిన గవర్నర్ కు పంపించారని గుర్తు చేశారు. అందువల్ల ఎలాంటి న్యాయపరమైన అవరోధాలు ఉండవన్నారు. హైకోర్టులో రిజర్వేషన్ల బిల్లు పై ప్రభుత్వం సమర్థవంతమైన న్యాయవాదులను పెట్టి , వాదించాలని కోరారు. 42 శాతం రిజర్వేష్లలపై న్యాయస్థానంలో గెలుస్తారని ఆర్ కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు.

# రాయదుర్గంలో గజం మూడున్నర లక్షలు..




హైదరాబాద్, నవంబర్ 13

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ గత కొన్నేళ్లలో భారీగా పెరిగిపోయింది. నగరంలో ఎక్కడ చూసినా గజం లక్షల్లో పలుకుతోంది. ఇక సర్కార్ భూములను విక్రయించేందుకు ప్రభుత్వం నిర్వహించే వేలంలో రికార్డు ధరలు మోగుతున్నాయి. తాజాగా రాయదుర్గంలో చదరపు గజానికి ఏకంగా రూ.3.40 లక్షలు పలికి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. అయితే 8 ఏళ్లలోనే ఆ భూమి ఏకంగా 4 రెట్లు పెరగడం గమనార్హం.తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇక హైదరాబాద్ , నగర చుట్టు పక్కల జరుగుతున్న అభివృద్ధితో.. రియల్ ఎస్టేట్ రంగం అంచనాలకు మించి రికార్డులు సృష్టిస్తోంది. నగరంలో కీలక ప్రాంతాల్లో భూముల ధరలు చూస్తే.. కళ్లు తిరిగిపోవాల్సిందే. సామాన్యులే కాదు.. ధనవంతులు కూడా కొనలేని రీతిలో భూముల ధరలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూములు కూడా.. హైదరాబాద్‌లో ఉండటంతో.. అది బంగారు బాతులా మారింది. దీంతో రాష్ట్ర ఖజానా నింపేందుకు.. ప్రభుత్వం అప్పుడప్పుడూ భూములను విక్రయిస్తూ ఉంటుంది. వేలం ద్వారా ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతుంది.తాజాగా తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన వేలంలో రికార్డు ధర పలికింది. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీకి మధ్యలో ఉన్న రాయదుర్గం ప్రాంతంలో వేలం నిర్వహించగా.. కళ్లు బైర్లుకమ్మే ధర వచ్చింది. ఒక ఎకరం భూమిని వేలం వేయగా.. ఒక్కో చదరపు గజానికి రూ.3,40,000ల చొప్పున గణనీయమైన ధర పలికి.. అందర్నీ షాక్‌కు గురి చేసింది.ఒక చదరపు గజానికి రూ.3.40 లక్షల రికార్డు స్థాయ ధరతో తాజాగా నిర్వహించిన ఈ వేలం.. గత రికార్డును బద్దలు కొట్టింది. గతంలో 2017లో ఇదే ప్రాంతంలో చదరపు గజం రూ.88 వేలు పలికింది. కానీ గత 8 ఏళ్లలోనే ఆ భూమి ధర ఆకాశాన్నంటడంతో అంతా అవాక్కయ్యారు. ఈ కొత్త ధర పాత రికార్డు కంటే 4 రెట్లు ఎక్కువ కావడం విశేషం. ఈ 4 రెట్ల ధర కేవలం 8 ఏళ్లలోనే రావడం గమనార్హం. రాయదుర్గం హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో గజం రూ.3.40 లక్షలు పలికినట్లు టీజీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ కె.శశాంక వెల్లడించారు. మొత్తం 4700 గజాల స్థలాన్ని విక్రయించగా.. రూ.159.80 కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు.ఇక రాయదుర్గం భూమికి ఇంతటి భారీ ధర పలకడానికి పలు కారణాలు ఉన్నాయి. నాలెడ్జ్ సిటీలోని బొటిక్ మిక్స్‌డ్ యూజ్ ప్లాట్‌కు ఉన్న బలమైన డిమాండేనని తెలుస్తోంది. అక్కడ పరిమితంగా, అధిక నాణ్యత గల స్థలాలకు ఎంతటి అపారమైన విలువ లభిస్తుందో ఈ వేలం రుజువు చేసిందని రియల్ ఎస్టేట్ నిపుణులు పేర్కొంటున్నారు. అత్యంత ఖరీదైన ఈ వేలం.. హైదరాబాద్ నగరాన్ని అగ్రశ్రేణి పెట్టుబడి గమ్యస్థానంగా మరింత పటిష్టం చేస్తుందని చెబుతున్నారు. అదే సమయంలో ఇది రాష్ట్ర ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని

# కేసీఆర్ ఉంటే ఆ లెక్కేవేరా..



హైదరాబాద్, నవంబర్ 13, (న్యూస్ పల్స్)

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్ కు పట్టం కట్టడంతో బీఆర్ఎస్ కార్యకర్తల్లో కొత్త చర్చ జరుగుతోంది. ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్ దే విజయం అని ప్రకటించినప్పటికీ.. 4 నుంచి 7 శాతం లోపే మెజారిటీ ఉండొచ్చనే అంచనాలు ఉండటంతో తమ పార్టీ గెలుపుపై బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఆశలు సన్నగిల్లాయి. తమ పార్టీ అధినేత కేసీఆర్.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారానికి వచ్చి ఉంటే.. పరిస్థితి మరోలా ఉండేదన్న టాక్ బీఆర్ఎస్ లో వినిపిస్తోంది.వాస్తవానికి జూబ్లీహిల్స్ ప్రజలు తమవైపే ఉన్నారని, అయితే మరింత పటిష్ట వ్యూహాన్ని అమలు చేసి ఉంటే ఫలితం వేరేలా ఉండేదన్న చర్చ బీఆర్ఎస్ లో జరుగుతోంది. ఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాలు చూస్తే కాంగ్రెస్ కు, బీఆర్ఎస్ కు మధ్య పెద్ద వ్యత్యాసం ఏమీ లేకపోవడం ఇప్పుడు బీఆర్ఎస్ ను ఆలోచనలో పడేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఇంకాస్త ఎఫర్ట్ పెట్టి ఉంటే బాగుండేదన్న చర్చ గులాబీ పార్టీ నేతల్లో జరుగుతోంది.అందులో ప్రధానంగా పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి వచ్చి ఉంటే.. పరిస్థితి మరోలా ఉండేదన్న అభిప్రాయం బీఆర్ఎస్ పార్టీలో వ్యక్తమవుతోందని తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ ఒక్క రోడ్ షో లో పాల్గొని ప్రసంగించినా.. ఆ ప్రభావం చాలా ఉండేదన్న టాక్ బీఆర్ఎస్ లో వినిపిస్తోంది. అలా కాకపోయినా కనీసం కేసీఆర్ తో జూబ్లీహిల్స్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడించి, ఒక చిన్న వీడియో సందేశం ఇప్పించినా బాగుండేదని అంటున్నారు. కేసీఆర్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ప్రచారం చేస్తే కచ్చితంగా 4 నుంచి 5శాతం ఓటర్లు ప్రభావితం అయ్యేవారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారానికి రాకపోవడాన్ని అధికార కాంగ్రెస్ తమకు అనుకూలంగా మార్చుకుందన్న చర్చ జరుగుతోంది. కేసీఆర్ ఓటు అడగనప్పుడు వారి అభ్యర్థికి ఓటు వేయాల్సిన అవసరం ఏముందన్న కోణంలో రేవంత్ రెడ్డి లేవనెత్తిన పాయింట్ కాంగ్రెస్ కు కలిసి వచ్చిందనే గుసగుసలు బీఆర్ఎస్ లో వినిపిస్తున్నాయి. ప్రచార సమయంలో తాము గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేస్తూ వచ్చిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు కేసీఆర్ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారానికి వచ్చి ఉంటే.. పరిస్థితి మరోలా ఉండేదని చర్చించుకుంటున్నారు అనే టాక్ వినిపిస్తోంది.

# రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి నగర పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

## సి.ఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్ ఈ నెల 16వ తేదీన ఉప రాష్ట్రపతి, 21 తేదీన రాష్ట్రపతి, హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. డా.బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు.

సంబంధిత విభాగాల అధికారులు సమన్వయం చేసుకోని, ఆయా డిపార్ట్ మెంట్ల వారీగా నోడల్ ఆఫీసర్ ను నియమించి నిబంధనల ప్రకారం తగు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం బేగంపేట్ ఎయిర్ పోర్టు కు చేరుకుంటారని తదనంతరం రాజ్ భవన్ లో స్వల్ప విశ్రాంతి, గవర్నర్ హై టీ లో పాల్గొని, తరువాత రామోజీ ఫిల్మ్ సిటీ లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 8.00 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి న్యూఢిల్లీకి బయలుదేరుతారని అధికారులు పేర్కొన్నారు. బ్లూ బుక్, వివిఐపి ప్రొటోకాల్ మాన్యువల్ ప్రకారం తగు భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్త్ ప్రణాళికను పోలీస్ శాఖ రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా వివిఐపిలకు తగు భద్రతా ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. జి.ఎ.డి., ఫైర్ సర్వీస్, రోడ్లు, భవనాలు, వైద్యారోగ్య, మున్సిపల్, ఇంధన, బి.ఎస్.ఎన్,ఎల్, హార్టి కల్చర్ విభాగాలు నిర్దేశించిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆధికారులను ఆదేశించారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 21 తేదీన మధ్యాహ్నం బేగంపేట్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. స్వల్ప విరామం కోసం రాజ్ భవన్ లో బస చేసి, తరువాత రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన భారతీయ కళా మహోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాత్రి రాజ్ భవన్ లో బస చేసి 22వ తేదీ ఉదయం పుట్టపర్తి పర్యటనకు బయలుదేరుతారని అన్నారు.

రెండు కార్యక్రమాలలో అన్ని సంబంధిత డిపార్టుమెంట్ అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా ప్రతి ఏర్పాటును స్వయంగా పర్యవేక్షించాలని, ప్రస్తుత పరిస్థితులల్లో భద్రతా పరంగా మరింత శ్రద్ధతో ఏర్పాట్లు చేయాలని సీఎస్ కోరారు.

రామోజీ ఫిల్మ్ సిటీ లో కార్యక్రమ నిర్వహణకు సంబంధిత నిర్వహకులు ఉప రాష్ట్రపతి కార్యాలయం అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా కోరారు. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్లు ఏర్పాట్లపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని కోరారు. రాజ్ భవన్లో ఏర్పాట్లు, సన్నద్ధతపై తగు చర్యలు తీసుకోవాలని రాజ్ భవన్ జాయింట్ సెక్రెటరీని కోరారు. మిలటరీ, ఏయిర్ పోర్టు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రెండు కార్యక్రమాలలో ప్రోటోకాల్, భద్రత ఏర్పాట్లు సజావుగా ఉండాలని, కార్యక్రమానికి ముందు రోజున ఏఎస్ఎల్, ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించాలని అధికారులను కోరారు.

ఈ సమిక్షా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి రఘునందన్ రావు, అదనపు డిజిపిలు విజయ్ కుమార్, మహేష్ భగవత్,జీహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ అష్ట. ప్రియాంక, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య, రామోజీ ఫిల్మ్ సిటీ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో అన్ని సర్వే నెంబర్లు గోల్డెన్ రికార్డులుగా తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, నవంబర్ 13 (భారత శక్తి): భూ రికార్డుల స్వచ్ఛీకరణ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లోని రెవెన్యూ రికార్డులను గోల్డెన్ రికార్డులుగా తీర్చిదిద్దే చర్యలను ముమ్మరం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.

గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో చోటుచేసుకున్న భూ సమస్యలపై.. రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణతో గోల్డెన్ రికార్డుల సాధన కోసం సంబంధిత రెవెన్యూ అధికారులతో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగాజిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు.. జేసీ అదితి సింగ్, బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, కుడా సెక్రెటరీ శిరీష హాజరయ్యారు. ఇందులో భాగంగా బి.మఠం మండలానికి ఏర్పాటు చేసిన 20 మంది విఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో కూడిన ప్రత్యేక టీమ్ సభ్యులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు అందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో గతంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది తప్పిదాల వల్ల భూ ఆక్రమణలు, భూ రికార్డుల్లో తప్పిదాలు జరిగాయన్నారు. ప్రత్యేకించి బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలతో పాటు, బి.మఠం మండలంలో అధిక సంఖ్యలో భూ సమస్యలు ఉన్నట్లు.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదులు అందడం జరిగిందన్నారు.

ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక టీముల ద్వారా అన్ని గ్రామాలలో రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే ప్రతి సర్వే నెంబర్ ను, సంబంధిత విస్తీర్ణాన్ని ఆర్ఎస్ఆర్, వెబ్ ల్యాండ్ ద్వారా నవోదు చేయడం జరుగుతోందన్నారు.

పట్టా, అసైన్డ్ భూ రికార్డులన్నింటినీ ఒక ఎస్ఓపి ప్రకారం పట్టాదారు, అనుభవాదారు, 22 ఏ, డికేటీ, పివోటీ భూములు, వ్యక్తి పేరు, ఊరి పేరు, ఖాతా నెంబరు తదితర వాటిని వెరిఫై చేసి రికార్డుల వర్గీకరణ చేయడం జరుగుతుందన్నారు.

అత్యంత ప్రధాన్యతతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎటువంటి తప్పిదాలు, ఎలాంటి వ్యక్తిగత, రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా వెరిఫికేషన్ చేయాలని ప్రత్యేక టీమ్ సభ్యులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎలాంటి కోర్టు వ్యవహారాలు, కుటుంబ వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే ఈ కార్యక్రమాన్ని ఆధునిక పరిజ్ఞానంతో చేపట్టిందన్నారు.

ఈ కార్యక్రమంలో అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు విఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల శుభాకాంక్షలు



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 13:

జిల్లా టిఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి కోడలి వివాహ వేడుకల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఘట్కేసర్ లక్ష్మీ కన్వెన్షన్ లో జరిగిన వివాహ వేడుకల్లో చింతా ప్రభాకర్ పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ జిల్లా నాయకులు జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# చైతన్యపురి పరిధిలో విషాద ఘటన గ్యాస్ లీక్ చేసి వివాహిత ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్ నవంబర్ 13 (భారత శక్తి):

హైదరాబాద్లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ద్వారకాపురి కాలనీలో వుంటున్న ప్రవీణ్ రెడ్డి. భార్య ప్రతిభ లకు 2010లో వివాహం అయింది. ఎనిమిదవ తరగతి చదువుతున్న కూతురుంది.

ప్రతిభ గ్యాస్ సిలిండర్ను స్వయంగా లీక్ చేసి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడిన మహిళను తొలుత సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తరువాత పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం, ఆ మహిళ గతంలో లైజాల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు, తాజాగా గ్యాస్ సిలిండర్ లీక్ చేసి మరోసారి ప్రాణాలు తీసుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. వైద్యుల సమాచారం మేరకు, ఆమెకు 90 శాతానికి పైగా కాలిన గాయాలు ఉండగా, పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రమాదానికి గల పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# శబరిమల యాత్ర దిగ్విజయం కావాలి

## – జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర్ శర్మ సిద్ధాంతి
## – రాము స్వామి ఆధ్వర్యంలో పాదయాత్రగా సంగారెడ్డి నుంచి శబరిమలకు అయ్యప్ప స్వాములు




సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 13 :

సంగారెడ్డి పట్టణం నుంచి తిరుపతి, కాణిపాకం అరుణాచలం మీదుగా శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్న రాము గురుస్వామి ఆధ్వర్యంలోని స్వాముల బృందాన్ని గురువారం తమిళనాడు వేద సందూర్ వద్ద జ్యోతిర్వాస్తు విద్యాపీఠ వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి కలిశారు. ఈ సందర్భంగా స్వాముల బృందం మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆశీస్సులు అందుకున్నారు. కాలినడకన దైవాన్ని దర్శిస్తే దాన్ని తీర్థయాత్ర అంటారని సిద్ధాంతి తెలిపారు. ఇప్పటివరకు 1250 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసినట్లు రాము గురు స్వామి సిద్ధాంతికి వివరించారు. కటోర దీక్షలతో చేపట్టిన పాదయాత్ర సుఖప్రదంగా జరగాలని సిద్ధాంతి ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. మరో 250 కిలోమీటర్లతో శబరిమల యాత్ర పూర్తి అవుతుందని స్వాములు పేర్కొన్నారు. క్షేమదాయకంగా యాత్రను పూర్తి చేసుకొని సంగారెడ్డి పట్టణానికి స్వాముల బృందం చేరుకోవాలని సిద్ధాంతి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.




# రైతుల నుండి తరుగు పేరుతో కొట్టేసిన ధాన్యం మొత్తాన్ని రికవరీ చేయాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 13: గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ, జిల్లాలో రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలని దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు రైస్ మిల్లర్లలో కొందరు అన్నదాతలను నిలువునా దోపిడీ చేస్తున్నారని వారి దోపిడిని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలు సెంటర్లనుండి అదనంగా కొందరు రైస్ మిల్లు యజమానులు 5 నుండి 8 కిలోల వరకు రైతులు నుండి తరుగు పేరుతో రైస్ మిల్లర్లు సోమ్ము చేసుకుంటున్నారని సెంటర్ నిర్వాహకులకు సైతం రైస్ మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారన్నారు అలాంటి రైస్ మిల్లులపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి అవినీతికి పాల్పడుతున్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని సెంటర్ కు సంబంధం లేకుండా నేరుగా తక్కువ ధరకు రైతుల నుండి కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లులపై అధికారులు చర్యలు తీసుకోవాలని గన్ని సంచులు ఇవ్వకుండా రైతులను నష్టపరుస్తున్నారని గన్ని సంచుల ఇవ్వకుండా కోట్ల రూపాయలు సంపాదించుకుంటున్నారు. ఇలాంటి రైస్ మిల్లర్లు వారి నుండి రికవరీ చేయాలని తేమ శాతంతో నిమిత్తం లేకుండా కొనుగోలు వేగవంతం చేయాలని బోనస్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు బోనస్ డబ్బులు బోనస్ డబ్బులు ఇంకా జమ చేయలేదని వెంటనే వాటిని జమ చేయాలని డిమాండ్ చేశారు రైస్ మిల్లర్ల దోపిడిపై త్వరలో జిల్లా కలెక్టర్ దృష్టికి సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు ముదాం అరుణ్ పాల్గొన్నారు.

# ఐకెపి కొనుగోలు కేంద్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## -మహిళల అభ్యున్నతికి డిఆర్డిఏ కృషి చేస్తుంది

### -ఐకెపి కొనుగోలు కేంద్రాలను యూనిఫామ్ స్టిచ్చింగ్ సెంటర్లను సందర్శించిన- సెర్ప్ నాన్ ఫామ్ డైరెక్టర్ జాన్సన్



సూర్యాపేట, భారతశక్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 13:

రైతులు ఐకెపి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ నాన్ ఫామ్ డైరెక్టర్ జాన్సన్ తెలిపారు.బుధవారం సూర్యాపేట మండలం ఇమాంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదేవిధంగా యూనిఫాం స్టిచింగ్ సెంటర్లను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఐకెపి కేంద్రాలను నిర్వహిస్తున్న మహిళ సంఘాలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు.డి ఆర్ డి ఏ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు మహిళల అభివృద్ధికి ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. ఆయన వెంట డి ఆర్ డి ఎ పిడి అప్పారావు,ఎ పి డి సురేష్,డిపిఎం లు అరుణ్ కుమార్,నగేష్, లక్ష్మీనారాయణ, ఏపిఎం మాతంగి మైసయ్య,సీసీ లు విజయబా భాను, మారిపెద్ది యాదగిరి కేంద్రాల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఇంచార్జి డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (డీఎంహెచ్వో)గా డా. ఎం. విద్యా రాణ్ వల్కర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 13: నూతన ఇంచార్జి డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (డీఎంహెచ్వో)గా డా. ఎం. విద్యా రాణ్ వల్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా కలెక్టర్‌తో జిల్లాలో ఆరోగ్య సేవల మెరుగుదల, వైద్య సిబ్బంది సమన్వయం, మాతా-శిశు ఆరోగ్య కార్యక్రమాల అమలు తదితర అంశాలపై చర్చించారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తాను కృషి చేస్తానని డాక్టర్ విద్యా తెలిపారు.



# లింగంపేట మండలం ఎల్లారాం గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 13: గురువారం లింగం పేట మండలం ఎల్లరాం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సందర్శించారు.

ఈ సందర్భంగా వరి ధాన్యాన్ని హమాలీలు సంచులలో నింపి ప్యాక్ చేస్తున్న తీరును స్వయంగా దగ్గరుండి పరిశీలించారు.

ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ, ఎక్కడి నుండి వచ్చారు అని అడిగి తెలుసుకొని త్వరగా వడ్లను సంచుల్లో నింపి త్వరగా లారీ లలో లోడ్ చేయాలనీ, త్వరితగతిన పూర్తి చేయాలని, ట్యాబ్ ఎంట్రీలు అవుతున్నాయా, పెమెంట్ కు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుని ఇంటి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 13: లింగం పేట మండలం ఎల్లారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించుకుంటున్న (నల్లమల లక్ష్మీ/రాజయ్య) అనే లబ్ధిదారుని ఇంటిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం గృహరహిత పేదల సంక్షేమార్థం అందిస్తున్న ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణంలో నాణ్యతను కాపాడుతూ, నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది లబ్ధిదారులతో సమన్వయం సాధించి పనుల పురోగతిని క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆయన ఆదేశించారు.ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇసుక, ఇటుకలు వంటి సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైన ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు.గ్రామాల్లో ఇంకా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి మార్కవుట్ పనులు ప్రారంభించాలని తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారుడు , గ్రామస్తులు చాలా ఆనందం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలుపుతూ, గ్రామంలో చేపట్టే ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహప్రవేశానికి తమరు కచ్చితంగా రావాలని కలెక్టర్ ను కోరగా గృహప్రవేశానికి తప్పకుండా వస్తానని తెలిపారు .



# వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

మణుగూరు, నవంబర్ 13 (భారతశక్తి): మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో ప్రతిష్టించిన శ్రీ వైకుంఠ సీతారామా చంద్రస్వామి వారి దేవాలయం అర్చకులు బాలాజీ శర్మ నివాసంలో మాలదారులు, భక్తుల మధ్య కోలాహలంగా బుధవారం రాత్రి మహ పడిపూజ వైభవంగా నిర్వహించారు. అర్చకులు బాలాజీ శర్మ గురుస్వామి 24వ పడి సందర్భంగా మణికంఠుడికి మహా పడిపూజ అత్యంత వైభవపేతంగా జరిపించారు. ముందుగా మహాపడి పద్దెనిమిది మెట్ల ముందు గౌరమ్మను చేసి కలశ పూజ చేశారు. అయ్యప్ప సోదరులైన అగ్రజా గణాధిపతి గణపయ్యకు, సుబ్రహ్మణ్యం స్వామికి అష్టోత్తర నామాలతో పూజలు చేశారు. అనంతరం హరిహర పుత్రుడైన అయ్యప్ప స్వామికి ప్రీతికరమైన రోజు బుధవారం కావడంతో ఉదయం పంచామృతాలతో అభిషేకం చేశారు. కన్నె స్వాములతో పద్దెనిమిది మెట్లపై పెట్టిన దీపాలను వెలిగించారు. శ్రీ వైకుంఠ సీతారామా చంద్రస్వామి వారి ఆలయం అధ్యక్షులు సారంపెల్లి రాంరెడ్డి పీఠం గురుస్వాములు ఎస్వీ నాయుడు, అశోక్ నాయుడు ఆధ్వర్యంలో అయ్యప్ప సోదరుల భజన పాటలతో అలరించారు. మహపడి కార్యక్రమంలో గురుస్వాములు భక్తి రంజింప చేసే పాటలు పాడి స్వాములకు ఉత్తేజాన్ని నింపారు. దుర్గామాత, శివయ్య, అయ్యప్ప మాలలు ధరించిన స్వాములు భక్తిలో లీనమై అయ్యప్ప స్వామిని మేలుకొల్పే విధంగా పెడతుల్లు ఆడుతూ నృత్యాలు చేశారు. గురు స్వాములు పాడిన భజన పాటలకు మాల ధరించిన స్వాములు, మాల ధరించని భక్తులతో మండపం అంతా అయ్యప్ప శరణు ఘోషతో సందడి వాతావరణం నెలకొంది. అర్చకులు బాలాజీ శర్మ గురు స్వామి దంపతులు రాత్రి 10 గంటలకు మహాపడి వెలిగించిన అనంతరం స్వాములకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం వివిధ పీఠాల నుండి వచ్చిన గురుస్వాములను శాలువాతో సత్కరించారు.

ఒడుదొడుకులు ఎదుర్కొని

# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు ఫ్లాట్‌గా ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు..ఆ తర్వాత లాభాల్లో కదలాడాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, శుక్రవారం వెలువడనున్న బిహార్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీనికితోడు మూడు రోజుల వరుస రాణించిన వేళ మదుపర్లు స్వీకరణకు దిగడంతో సూచీలు స్వల్ప లాభాలకు పరిమితమయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 84,525.89 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,466.51) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఇంట్రాడేలో 84,253.05 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ 84,919.43 వద్ద గరిష్ఠాన్ని తాకింది. తర్వాత అమ్మకాల ఒత్తిడితో కేవలం 12.16 పాయింట్లు లాభపడి 84,478.67 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 3.35 పాయింట్ల లాభంతో 25,879.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.68గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటెర్నల్, టీఎంసీవీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ట్రెంట్, టాటా స్టీల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.80 డాలర్లు ఉండగా.. బంగారం ఔన్సు 4237 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఒక్కరోజే రూ. 3 వేలు పెరిగిన బంగారం ధర

**రూ.10 వేలు పెరిగిన వెండి**

**హైదరాబాద్‌లో రూ. 1,31,500కు చేరిన పసిడి ధర**

**రూ. 1,17,000 పైన పలుకుతున్న 22 క్యారెట్ల బంగారం**

**రూ. 1,71,000 పైకి చేరుకున్న కిలో వెండి ధర**



**హైదరాబాద్:** బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ నగరంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజులో రూ. 3 వేలకు పైగా పెరిగి రూ. 1,31,500కు చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,17,000 పైన పలుకుతోంది. కిలో వెండి ధర ఒక్కరోజులో రూ. 10 వేలకు పైగా పెరిగి రూ. 1,71,300కు చేరుకుంది. ఇటీవలి కాలంలో దాదాపు స్థిరంగా ఉన్న బంగారం ధరలు, తాజాగా మరోసారి పెరుగుతూ ఉండడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,200 డాలర్లను దాటి 4,218 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి ఔన్సు ధర 54.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అమెరికా చరిత్రలో అత్యధిక కాలం పాటు కొనసాగిన ప్రభుత్వ షట్‌డౌన్ ముగియడంతో ఆర్థిక కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. ముఖ్యంగా ఆర్థిక గణాంకాలు వెలువడటంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం ఉంది. ఈ కారణంగానే బంగారం ధరలు పెరుగుతున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

## పీఎఫ్ విత్ డ్రా చేస్తే పన్ను కట్టాలా..

**పీఎఫ్ విత్ డ్రాను సులభతరం చేసిన కేంద్రం**

**డ్రా చేసుకునే ఆప్షన్ల సంఖ్య పెంపు**

**అత్యవసరమైతే తప్ప విత్ డ్రా చేయొద్దంటున్న నిపుణులు**




**న్యూఢిల్లీ:** ఉద్యోగ భవిష్య నిధి (ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్- ఈపీఎఫ్) లోని సొమ్మును విత్ డ్రా చేసుకోవడాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఈపీఎఫ్ ఆఫీసు దాకా వెళ్లాల్సిన అవసరంలేకుండా మొబైల్ ఫోన్ ద్వారా విత్ డ్రా చేసుకునే సదుపాయం కల్పించింది. విత్ డ్రాకు ఉన్న పరిమిత ఆప్షన్లకు మరికొన్నింటిని జోడించింది. దీంతో పీఎఫ్ విత్ డ్రా చేసుకోవడం ఈజీగా మారింది. అయితే, ఇలా విత్ డ్రా చేస్తున్న సొమ్ముకు పన్ను చెల్లించాలా.. అంటే అక్కర్లేదనే నిపుణులు చెబుతున్నారు. అయితే, భవిష్యత్ అవసరాల కోసం దాచుకునే ఈ సొమ్మును అత్యవసరమైతే తప్ప విత్ డ్రా చేయొద్దని కూడా వారు సూచిస్తున్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం కూడా నిబంధనలలో మార్పులు చేసింది.

### విత్ డ్రా చేసిన మొత్తంపై పన్ను ఎప్పుడంటే..

ఉద్యోగంలో చేరిన ఐదేళ్లలోపు పీఎఫ్ నుంచి సొమ్ము విత్ డ్రా చేస్తే పన్ను చెల్లించాల్సి ఉంటుందని నిబంధనలు చెబుతున్నాయి. ఉద్యోగం మారిన సందర్భాలలో రెండు సంస్థల్లో పనిచేసిన కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. పాత సంస్థలో వినియోగించిన పీఎఫ్ ఖాతాను కొత్త సంస్థకు బదిలీ చేసిన సందర్భంలోనే ఈ రూల్ వర్తిస్తుంది. కొత్త ఖాతా తెరిస్తే మళ్లీ మొదటి నుంచే లెక్కిస్తారు. ఈపీఎఫ్ లో యజమాని వాటా కింద జమ అయిన మొత్తంతో పాటు డిపాజిట్ పై వడ్డీకి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఉద్యోగి ఆదాయాన్ని బట్టి పన్ను శ్లాబు వర్తిస్తుంది. ఆదాయపు పన్ను శాఖకు పాన్ కార్డు వివరాలు సమర్పించకపోతే 34.60 శాతం టీడీఎస్ కట్ అవుతుంది.

### ఆదాయపు పన్ను చట్టం ప్రకారం..

ఐదేళ్లకు మించిన ఈపీఎఫ్ ఖాతాల్లోని డిపాజిట్ మొత్తంలో రూ.1.50 లక్షల వరకు (పాత పన్ను విధానంలో) పన్ను మినహాయింపు పొందొచ్చు. కొత్త పన్ను విధానంలో కేవలం యజమాని వాటాపై మాత్రమే మినహాయింపు లభిస్తుంది. రెండు విధానాల్లోనూ ఈపీఎఫ్ ఖాతాలోని నగదు నిల్వలు, మెచ్యూరిటీ సొమ్ము పూర్తిగా పన్ను రహితం.

# టెండూల్కర్ ఔట్.. ముంబై ఇండియన్స్‌కు శార్దూల్ ఠాకూర్..?






**ముంబై:** ఐపీఎల్ 19వ సీజన్ రీటెన్షన్ గడువు సమీపిస్తోంది. ఆలోపు ఆటగాళ్ల ట్రేడింగ్, వదిలించుకోవాల్సిన క్రికెటర్ల గురించి ఫ్రాంచైజీలు కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే సంజూ శాంసన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ గట్టిగా ప్రయత్నిస్తోంది. ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ సైతం బిగ్ ప్లేయర్ శార్దూల్ ఠాకూర్‌ను కొనేందుకు సిద్ధమవుతోంది. అయితే.. పరస్పర బదలాయింపు విధానాన్నేముంబై అనుసరించే అవకాశముంది. లక్నో సూపర్ జెయింట్స్ ఆల్‌రౌండర్ అయిన శార్దూల్‌ను స్వాప్ విధానంలో లేదంటే డబ్బులకైనా తమ గూటికి చేర్చుకోవాలని ముంబై యాజమాన్యం భావిస్తోంది.

ట్రేడ్ పద్ధతికి లక్నో అంగీకరిస్తే.. గత సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోని అర్జున్ టెండూల్కర్‌ను లక్నోకు ఇచ్చేయాలని ముంబై అనుకుంటోంది.ఇదే విషయమై లక్నో, ముంబై మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ స్వాప్ డీల్ కుదిరితే సరే.. లేదంటే శార్దూల్‌ను ఎలాగైనా కొనేందుకు ముంబై ఫిక్స్ అయిందని సమాచారం.పద్దెనిమిదో సీజన్‌లో పెద్దగా రాణించని శార్దూల్‌ను వదిలేసుకోవడమే మంచిదని సంజీవ్ గొయెంకా టీమ్ నిర్ణయించుకుంది. అనుభవజ్ఞుడైన ఈ ఆల్‌రౌండర్ సేవల్ని ఉపయోగించుకునేందుకు ముంబై ఆసక్తి చూపించింది. గాయపడిన పేసర్ దీపక్ చాహర్ స్థానాన్ని శార్దూల్‌తో భర్తీ చేయాలని ముంబై ఇండియన్స్ యాజమాన్యం అనుకుంది. దాంతో, ప్రస్తుతం ఇరు ఫ్రాంచైజీల మధ్య చర్చలు నడుస్తున్నాయి. అన్నీ కుదిరితే త్వరలోనే శార్దూల్ ముంబై జెర్సీ వేసుకోవడం ఖాయం. ఐపీఎల్‌లో ఈ పేస్ ఆల్‌రౌండర్ వేలానికి వెళ్లకుండానే అమ్ముడవ్వడం ఇది మూడోసారి కానుంది. 2017లో కింగ్స్ లెవన్ పంజాబ్ నుంచి అతడిని రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ తీసుకుంది. 2023లో ఢిల్లీ క్యాపిటల్స్ వద్దనుకోవడంతో శార్దూల్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ సొంతం చేసుకుంది.

### అదృష్టం వరించగా..

నిరుడు ఐపీఎల్ మెగా వేలంలో శార్దూల్ ఠాకూర్‌ను ఏ ఫ్రాంచైజీ కొనలేదు. దాంతో.. అతడు కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడాలని డిసైడయ్యాడు. కానీ, లక్నో సూపర్ జెయింట్స్ పేసర్ మొహ్సిన్ ఖాన్ గాయపడడంతో శార్దూల్‌ను అదృష్టం వరించింది. మొహ్సిన్ స్థానంలో ఈ పేసర్‌ను లక్నో రూ.2కోట్ల కనీస ధరకు తీసుకుంది. అయితే.. మెంటార్ జహీర్ ఖాన్ సూచలనతో ఆరంభంలో అదరగొట్టిన శార్దూల్ ఆ తర్వాత ఉసూరుమనిపించాడు. 10 మ్యాచుల్లో 11.02 ఎకానమీతో13 వికెట్లు తీశాడంతే. గత సీజన్‌లో అర్జున్ సైతం మూడువికెట్లకే పరిమితమయ్యాడు.

ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్

## షేన్ వాట్సన్ కొత్త అవతారం..

**కేకేఆర్ అసిస్టెంట్ కోచ్‌గా నియామకం..!**




**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు షేన్ వాట్సన్‌ను కేకేఆర్ జట్టులోకి తీసుకుంది. మాజీ ఆల్‌రౌండర్ కేకేఆర్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం వెల్లడించింది. ఆస్ట్రేలియా తరపున 59 టెస్టులు, 190 వన్డేలు, 58 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచులు ఆడిన వాట్సన్.. ఇంటర్నేషనల్ కెరీర్‌లో 10వేలకుపైగా పరుగులు చేశాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 280 కంటే ఎక్కువ వికెట్ల పడగొట్టాడు. వాట్సన్ 2007, 2015లో ప్రపంచకప్ గెలిచి ఆస్ట్రేలియా జట్టులో కీలకపాత్ర పోషించాడు. 2008 నుంచి 2020 వరకు ఐపీఎల్‌లో పలు జట్లకు ప్రాతినిథ్యం వహించాడు. ఐపీఎల్‌లో 145 మ్యాచ్‌లు ఆడాడు. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ తరపున బరిలోకి దిగాడు. క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాక వాట్సన్ ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌లో కోచ్, మెటర్ పాత్రలు పోషించాడు.

కేకేఆర్ అసిస్టెంట్ కోచ్‌గా అవతారమెత్తిన వాట్సన్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేకేఆర్ కోచింగ్ గ్రూప్, ప్లేయర్స్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. కోల్‌కతాకు మరో టైటిల్‌ను తీసుకువచ్చేందుకు తాను ఎదురుచూస్తున్నానని చెప్పాడు. కేకేఆర్ సీఈవో వెంకీ మైసూర్ మాట్లాడుతూ వాట్సన్‌ను కేకేఆర్ ఫ్యామిలీలోకి స్వాగతించడానికి సంతోషిస్తున్నామన్నారు. ఆటగాడిగా, కోచ్‌గా అతనికున్న అనుభవం జట్టుకు ఎంతో దోహదపడుతుందని చెప్పాడు. అభిషేక్ నాయర్‌ను కేకేఆర్ ఇటీవల హెడ్‌కోచ్‌గా నియమించింది. ముంబయి మాజీ ఆల్ రౌండర్ అయిన నాయర్‌కు కేకేఆర్‌తో చాలా రోజులుగా అనుబంధం ఉన్నది. అయితే, ఐపీఎల్ 2025లో జట్టు ప్రదర్శన పేలవంగా ఉండగా.. కేకేఆర్ జట్టును బలోపేతం చేయాలని భావిస్తుంది. కేకేఆర్ గత సీజన్‌లో ఆడిన 14 లీగ్ మ్యాచుల్లో కేవలం ఐదింట్లో గెలిచింది. ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది.

## టీ20 ట్రై సిరీస్‌కు 'ఉగ్ర' ముప్పు..!

**వేదిక, షెడ్యూల్‌ను సవరించిన పీసీబీ..!**



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ఇటీవల ఉగ్రదాడి జరిగింది. త్వరలో జరుగనున్న ట్రై సిరీస్‌కు సైతం ఉగ్రవాద దాడి ముప్పు పొంచి ఉంది. ఈ క్రమంలో భద్రతా కారణాల నేపథ్యంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీలంక, జింబాబ్వేలతో జరుగనున్న టీ20 ముక్కోణపు టీ20 సిరీస్ వేదికలతో పాటు షెడ్యూల్‌ను మార్చింది. మొదటి షెడ్యూల్ ప్రకారం ట్రై సిరీస్ నవంబర్ 17న మొదలుకావాల్సి ఉంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం 18న ప్రారంభం కానున్నది.

మ్యాచులన్నీ రావల్పిండిలోనే జరుగుతాయి. ఫైనల్‌తో సహా ఐదు మ్యాచులకు లాహోర్ అతిథ్యం ఇవ్వాల్సి ఉండగా.. ఏడు మ్యాచులు రావల్పిండిలోనే జరుగుతాయని పీసీబీ ధ్రువీకరించింది. టోర్నీ ఫైనల్ నవంబర్ 29 జరుగుతుంది. భద్రతతో పాటు ఇతర సమస్యలను దృష్టిలో పెట్టుకొని శ్రీలంక, జింబాబ్వే క్రికెట్‌ను సంప్రదించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పీసీబీ తెలిపింది. పాకిస్తాన్, శ్రీలంక మధ్య మిగిలిన రెండు వన్డేల తేదీల్లోనూ మార్పులు చేసింది. ఈ నెల 11న మ్యాచ్ జరగ్గా.. 13, 15 తేదీల్లో జరగాల్సిన మ్యాచులను 14, 16 తేదీల్లో రావల్పిండి వేదికగా జరుగుతాయి. ఇస్లామాబాద్‌లో ఇటీవల ఆత్మాహుతి దాడి జరిగిన విషయం తెలిసిందే. దాంతో శ్రీలంక ప్లేయర్లు తమ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు.

స్వదేశానికి వెళ్లిపోవాలని నిర్ణయానికి వచ్చారు. శ్రీలంక బోర్డు అధ్యక్షుడు షమ్మీ సిల్వా, పాకిస్తాన్‌లోని శ్రీలంక హైకమిషనర్ తర్వాత ఆటగాళ్లతో మాట్లాడి భద్రత విషయంలో హామీ ఇచ్చారు. ఆ తర్వాత పాకిస్తాన్‌లో వన్డే, ట్రై సిరీస్‌లో సిరీస్ ఆడుతారని శ్రీలంక జట్టు మేనేజర్ మహింద హలంగోడ ధ్రువీకరించారు. ఈ సందర్భంగా పాక్ క్రికెట్‌పై నమ్మకానికి ఇది సంకేతమని.. సిరీస్‌లో ఆడేందుకు అంగీకరించిన శ్రీలంక జట్టుకు పీసీబీ చైర్మన్ మోహ్సిన్ నఖ్వీ కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా.. ట్రై సిరీస్‌లో ప్రతి జట్టు నాలుగు మ్యాచులు ఆడుతుంది. అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు ఫైనల్‌లో తలపడుతాయి.

# రోహిత్ శర్మ విజయ్ హజారే ట్రోఫీలో ఆడతాడా..?


**కీలక సమాచారం అందించిన ఎంసీఏ..!**



**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ త్వరలో జరుగనున్నవ విజయ్ హజారే ట్రోఫీలో అందుబాటులో ఉంటాడని, ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కి సమాచారం అందించినట్లుగా వార్తలు వచ్చాయి. అయితే, మీడియా నివేదికలను ఎంసీఏకు చెందిన ఓ అధికారి తోసిపుచ్చారు. విజయ్ హజారే ట్రోఫీలో ఆడడంపై రోహిత్ నుంచి ఎలాంటి అప్‌డేట్ రాలేదని ఆయన జాతీయ మీడియా సంస్థకు తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి చర్చలు జరగలేదన్నారు. వాస్తవానికి, వన్డే క్రికెట్‌లో కొనసాగాలనుకుంటే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ దేశీయ టోర్నీలో ఆడాలని బీసీసీఐ సూచించిందని పలు నివేదికలు తెలిపాయి. ఈ విషయంలో ఎంసీఏకు రోహిత్ సమాచారం అందించాడని పేర్కొన్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ బ్యాట్‌తో రాణించాడు.

ఈ సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో ఓడిపోయినప్పటికీ.. రోహిత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకున్నాడు. ఈ సిరీస్‌లో ఓ సెంచరీ, హాఫ్ సెంచరీ సహాయంతో మూడు మ్యాచుల్లో 202 పరుగులు చేశాడు. చివరి మ్యాచ్‌లో అజేయంగా 121 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక త్వరలో భారత జట్టు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడుతుంది. తొలి మ్యాచ్ నవంబర్ 30న రాంచీలో జరుగుతుంది. రెండు, మూడో వన్డే డిసెంబర్ 3, 6 తేదీల్లో జరుగుతాయి. దేశవాళీ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచులు డిసెంబర్ 25 నుంచి జనవరి 18 మధ్య జరుగుతుంది. ఈ టోర్నీలోని అన్ని మ్యాచులు అహ్మదాబాద్, రాజ్‌కోట్, జైపూర్, బెంగళూరులో జరుగనున్నాయి. ఈ డొమెస్టిక్ టోర్నీలో రోహిత్, కోహ్లీ ఆడతారా? లేదా? అన్నది ప్రస్తుతానికి స్పష్టత లేదు. కానీ, కొద్దిరోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## "అఖండ 2" నుంచి
# ఫస్ట్ సాంగ్ రెడీ
### తాండవం మొదలవబోతోంది!




టాకీస్: నందమూరి బాలకృష్ణ-బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ "అఖండ 2" కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోనే బజ్ పెరిగిపోయింది. ఇక ఇప్పుడు ఆ ఎగ్జైట్మెంట్‌ని మరింత పెంచేలా ఫస్ట్ సింగిల్ రిలీజ్ అవ్వబోతోంది. సంగీత దర్శకుడు తమన్ స్వయంగా ఈ పాటపై భారీ హైప్ క్రియేట్ చేశాడు. ఆయన సోషల్ మీడియాలో రాసిన ప్రకారం .. "శంకర్ మహదేవన్, కైలాష్ ఖేర్ కలిసి పాడిన ఈ సాంగ్‌ను వింటే నిద్రపట్టదు ఆ ఎనర్జీ మనలో తాండవం చేస్తుంది! ఇది సాధారణ పాట కాదు, ఇది శివుడి శక్తి!" అంటూ అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటేలా చేశాడు. ఈ సాంగ్ లాంచింగ్ కోసం ముంబైలోని జుహూలో ఉన్న పీవీఆర్ వేదికైంది. నవంబర్ 14న ఈవెంట్ ప్లాన్ చేశారు.

ఇప్పటికే సినిమా రిలీజ్‌దగ్గర పడడంతో టీమ్ ఇప్పుడు ప్రమోషన్ మోడ్‌లోకి వెళ్లింది. ప్యాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ ప్రాజెక్ట్‌కు తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ మార్కెట్లలో భారీగా బజ్ క్రియేట్ చేయాలనే ప్లాన్‌లో ఉన్నారు. ఇక "చికిరి చికిరి" పాటతో రామ్ చరణ్ సినిమా సోషల్ మీడియాలో ఎలా దుమ్మురేపిందో, అదే రేంజ్‌లో అఖండ 2 తాండవం సాంగ్ కూడా ఫైర్ లెవెల్ హిట్ అవ్వాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. తమన్ మాటల ప్రకారం ఈ సాంగ్ అద్భుతంగా ఉంటే, అదే సినిమా ప్రమోషన్‌కి స్టార్ట్ పాయింట్ అవుతుందని సినీ వర్గాల టాక్.

సినిమా యూనిట్ టాక్ ప్రకారం "అఖండ 2 అవుట్‌పుట్ అద్భుతంగా ఉంది" అంటున్నారు. అయితే ఆ ఎమోషన్ ప్రేక్షకులకు రీచ్ కావాలంటే సరైన ఆల్బమ్, టీజర్, ట్రైలర్ సమయానికి రావడం కీలకం. అందుకే రాబోయే వారాల్లో బోయపాటి-బాలయ్య-తమన్ త్రయం ప్రమోషన్ రన్ గట్టిగానే ప్లాన్ చేస్తున్నారని సమాచారం. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు రిలీజ్ ముందు రోజు స్పెషల్ ప్రీమియర్ షోలు ప్లాన్ చేస్తున్నారని టాక్. "ఓజీ" తరహాలో షోలు పెడితే హైప్ ఇంకా రెట్టింపు అవుతుందని యూనిట్ భావిస్తోంది.బాలయ్య ఫ్యాన్స్ అయితే సోషల్ మీడియాలో ఇప్పటికే "మాస్ ఈజ్ బ్యాక్", "బోయపాటి ఫైర్ రిటర్న్స్" అంటూ ట్రెండ్స్ క్రియేట్ చేస్తున్నారు. "కేజీఎఫ్", "పుష్ప", "బాహుబలి", "కాంతారా" లాంటి సీక్వెల్స్‌ను మించిపోయే స్థాయిలో "అఖండ 2" నిలవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

## ఆహ్వానితులకు
# మాత్రమే ప్రవేశం
### దర్శకుడు రాజమౌళి ప్రకటన



టాకీస్: ప్రిన్స్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఎసెస్ఎంబి సినిమాకు సంబంధించిన ఈవెంట్ ఉంటుందా ఉండదా? అనే చర్చ రెండు రోజులుగా జరుగుతోంది. వరల్డ్ వైడ్ ఆడియెన్స్ ను దృష్టిలో పెట్టుకుని జియో హాట్ స్టార్ తో ఈ ఈవెంట్ ను రాజమౌళి బృందం ప్లాన్ చేసింది. నవంబర్ 15వ తేదీకి ఈ మూవీపై హైప్ పెంచుతూ ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ వస్తోంది. ఇప్పటికే శ్రుతీహాసన్  పాడిన పాటను రివీల్ చేసిన టీమ్, తాజాగా ప్రియాంక చోప్రా  లుక్ ను సైతం విడుదల చేసింది. ఇదిలా ఉంటే... ఢిల్లీలో జరిగిన బాంబ్ బ్లాస్ నేపథ్యంలో గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్ ఉండకపోవచ్చుననే ప్రచారం రెండు రోజులుగా జరుగుతోంది. దీనికి రాజ మౌళి తెర దించారు. ఖచ్చితంగా ఈ వేడుక ఉంటుందని హామీ ఇచ్చారు. కాకపోతే... ఇది పబ్లిక్ ఫంక్షన్ కాదని, కేవలం ఆహ్వానితులకు మాత్రమే అక్కడ ప్రవేశం ఉంటుందని, రామోజీ ఫిల్మ్ సిటీకి ఎవరు ఏ మార్గం గుండా రావాల్సి ఉంటుందనే విషయంలో రాజమౌళి ఓ వీడియో ద్వారా వివరించారు. పోలీసు శాఖ విధించిన ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని తాము కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు రాజమౌళి తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు, పెద్ద వారికి ఈ ఈవెంట్ లో పాల్గొనే అవకాశం లేదని స్పష్టం చేశారు. వారంతా జియో హాట్ స్టార్ లో చూసి ఆనందించవచ్చని చెప్పారు. రామోజీ ఫిల్మ్ సిటీ మెయిన్ గెట్‌ను  నవంబర్ 15వ తేదీ మూసి వేస్తున్నారని, దానికి ముందు, దాని తర్వాత ఉన్న మార్గాల ద్వారా ఈవెంట్ కు ఆహ్వానితులు రావాల్సి ఉంటుందని, వీలైనంత ముందుగా వస్తే మంచిదని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు క్రమశిక్షణతో మెలగకపోతే కార్యక్రమం రద్దు అయ్యే ఛాన్స్ కూడా ఉందని రాజమౌళి పరోక్షంగా హెచ్చరించారు. సో... మహేశ్ బాబు అభిమానులు, సినిమాను ప్రేమించే వారు ఏ రీతిన ఈ కార్యక్రమంలో పాల్గొని, ఏ స్థాయిలో దీనిని విజయ వంతం చేస్తారో చూడాలి.

# దేశంలో సగం మంది నన్ను చంపాలని చూశారు
### ద కేరళ స్టోరీపై ఆదాశర్మ తాజా కామెంట్స్


టాకీస్: వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తుంటారు నటి అదా శర్మ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది కేరళ స్టోరీ 2023లో విడుదలైన ఈ సినిమా సినీ, రాజకీయ రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ చిత్రం విడుదలైనప్పుడు దేశంలో సగం మంది తనను చంపాలని చూశారని అదా శర్మ తాజాగా వెల్లడించారు. రిస్క్ ఉన్న పాత్రలు చేసినప్పడే కెరీర్‌కు మరింత విలువ పెరుగుతుంది. '1920' సినిమాతో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. నా తొలి చిత్రమే పెద్ద సాహోసోపేతమని నేను భావిస్తాను. 'ది కేరళ స్టోరీ' విడుదలయ్యే వరకూ నాకు మంచి స్క్రిప్ట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేదాన్ని. ఆ చిత్రం తర్వాత నా కెరీర్ మారిపోయింది. దాని తర్వాత 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' చేశాను. ఈ రెండు చిత్రాలు విడుదలైనప్పడు బెదిరింపులు ఎదుర్కొన్నాను.  దేశంలో సగం మంది నన్ను చంపాలని కోరుకున్నారు. మిగతా సగం మంది నాపై ప్రశంసలు కురిపించారు. వారంతా నన్ను రక్షించారు' అని అదా తెలిపారు. స్క్రిప్ట్ ఎంపిక గురించి అదా మాట్లాడుతూ సవాలుతో కూడినవి మాత్రమే ఇష్టపడతానన్నారు. 'పాత్రలో భావోద్వేగం లేకపోతే నాకు నచ్చదు. యాక్షన్ సన్నివేశాలు ఉండాలి. నేను చేసే పాత్రలో ఎమోషన్ టచ్ ఉండాలి. అది చూసి నా కుటుంబం ఒకింత ఆందోళన చెందాలి. అవన్నీ లేకపోతే ఇక ఆ పాత్ర చేయడం ఎందుకు అని నాకు అనిపిస్తుందని అదా శర్మ చెప్పారు.




## నాని, రామ్‌చరణ్‌లతో దుల్కర్ పోటీ
### ముగ్గురు సినిమాలు వచ్చే ఏడాదికి విడుదల

**టాకీస్:** ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోని వివిధ భాషల్లో తమకంటూ సెఫరేటు ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటారు టాలీవుడ్ యాక్టర్లు రాంచరణ్, నాని, మాలీవుడ్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. యాక్టింగ్‌కు సంబంధించి ఈ ముగ్గురిలో ఎవరి స్టైల్ వారిదే.. ఈ స్టార్ హీరోల సినిమాలు ఒకేసారి బరిలోకి దిగితే ఎలా ఉంటుంది. అవును ఇప్పుడు ఆ వార్తే ఒకటి ఫిలింనగర్ సర్కిల్ లో రౌండప్ చేస్తోంది.

దుల్కర్ సల్మాన్ నటించిన కాంత 14న ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిసిందే. దుల్కర్ సల్మాన్ మరోవైపు పవన్ సాదినేని డైరెక్షన్‌లో ఆకాశంలో ఒక తార సినిమాలో నటిస్తున్నాడు. అయితే ఈ సినిమా రాంచరణ్, నాని ప్రాజెక్టులతో కలిసి 2026లో విడుదల కానుందంటూ వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. నాని నటిస్తోన్న




చిత్రం ది ప్యారడైజ్. ఈ మూవీ శ్రీరామ నవమి కానుకగా 2026 మార్చి 26న థియేటర్లలోకి రానుంది. రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం పెద్ది. ఈ మూవీ 2026 మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా టాక్ ప్రకారం దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న ఆకాశంలో ఒక తార కూడా ఇదే సీజన్‌లో విడుదలకు రెడీ అవుతుందట. ఒకవేళ ఇదే నిజమైతే రాంచరణ్, నాని నుంచి దుల్కర్ సల్మాన్‌కు గట్టి పోటీ ఉండబోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## దర్శకత్వం చేస్తానంటున్న రానా

**టాకీస్:** నటుడు రానా  తన చిరకాల కోరికను తీర్చుకోబోతున్నాడు. చిన్న వయసు నుండే రానా దర్శకత్వం మీద దృష్టి పెట్టాడు. కొన్ని డాక్యుమెంటరీలనూ తీశాడు. దాంతో ఎప్పటికైనా రానా మంచి దర్శకుడు అవుతాడని రామానాయుడు భావించారు. కానీ చిత్రంగా 'లీడర్' మూవీతో రానా హీరో అయిపోయాడు. ఆ తర్వాత నిర్మాతగా మారాడు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తనకు నచ్చిన పనిని చేస్తూ ముందుకు సాగుతున్నాడు. అలానే రానా తమ్ముడు అభిరామ్ 'అహింస' మూవీతో హీరో అయ్యాడు. తాజాగా దుల్కర్ సల్మాన్ తో కలిసి రానా 'కాంత' సినిమాలో నటించాడు. అంతే కాదు దుల్కర్ తో పాటు దీనిని నిర్మించాడు. ఇందులో రానా నటుడిగా కొన్ని సినిమాలను వదులు కున్నాడు కూడా. ఈ




నెల 14న 'కాంత' తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రానా దర్శకుడు కావాలనే తన కోరిక గురించి అభిప్రయాలు పంచుకున్నాడు. వచ్చే నెల 14న తాను దర్శకత్వం వహించే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియచేస్తానని చెప్పాడు. నటుడిగా, నిర్మాతగా, పంపిణీదారుడిగా సినిమా రంగం గురించి పూర్తి అవగాహన ఉన్న రానా మెగాఫోన్ పడితే చిరకాల కోరికను నెరవేర్చుకున్నవాడు అవుతాడు.  రానా దర్శకత్వం వహించే సినిమాను ఓన్ బ్యానర్ లో చేస్తాడా? బయటి నిర్మాణ సంస్థలో చేస్తాడా అనేది తెలియాల్సి ఉంది. అలానే తాను డైరెక్ట్ చేసే సినిమాలో రానా నటిస్తాడా? లేకపోతే కేవలం దర్శకత్వానికే పరిమితం అవుతాడా? అన్నది చూడాలి.

# ఫైట్స్ చేస్తున్న మన శంకర వర ప్రసాద్‌గారు

టాకీస్: చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు  'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తిక వార్త ఒకటి బయటకు వచ్చింది.

ప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఈ సీక్వెన్స్ ఫిలింనగర్ గోల్ఫ్ కోర్ట్ వల్ల  షురూ కాగా.. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ షెడ్యూల్‌తో



చిరంజీవికి సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల-విష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు.. 10 రౌండ్లలో కౌంటింగ్: ఆర్వీ కర్ణన్

హైదరాబాద్, నవంబర్ 13 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆర్వో కర్ణన్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని డీఆర్సీ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "శుక్రవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 407 పోలింగ్



కేంద్రాలకు సంబంధించిన ఓట్లు లెక్కిస్తాం. మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నందున ప్రత్యేక అనుమతి తీసుకుని లెక్కింపునకు 42 టేబుళ్లు ఏర్పాటు చేశాం. 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తిచేస్తాం. కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బందిని కేటాయించాం. ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం. మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ఫలితాలను వెల్లడిస్తాం"అని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. 15 ప్లాటూన్ల సిబ్బందిని రప్పిస్తున్నామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని.. అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం






హైదరాబాద్, నవంబర్ 13 (భారత శక్తి): కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. రెవెన్యూ దస్త్రాలు మంటల్లో దగ్ధమవుతున్నాయి. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు.

# మంత్రి కొండా సురేఖపై కేసు ఉపసంహరించుకున్న నాగార్జున

హైదరాబాద్, నవంబర్ 13 (భారత శక్తి): మంత్రి కొండా సురేఖ, ప్రముఖ నటుడు నాగార్జున మధ్య నెలకొన్న వివాదానికి తెర పడింది. నాగార్జునను ఉద్దేశిస్తూ మంత్రి సురేఖ నిన్న ఎక్స్ వేదికగా క్షమాపణలు చెప్పారు. ఆమె బహిరంగ క్షమాపణలను పరిగణనలోకి తీసుకున్న నాగార్జున, తమకు న్యాయం జరిగిందని భావించి..



క్రిమినల్ దావా పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నారు. నాగార్జున కుటుంబంపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానని మంత్రి కొండా సురేఖ నిన్న ఎక్స్‌లో పోస్టు చేసిన విషయం తెలిసిందే. "నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు. వారిని ఇబ్బందిపెట్టాలని కాని, వారి పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించాలన్నది కాని నా ఉద్దేశం కాదు. నాగార్జున కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా" అని పేర్కొన్నారు. దీంతో నాగార్జున, మంత్రి కొండా సురేఖ మధ్య కొన్ని నెలలుగా కొనసాగుతున్న న్యాయపరమైన వివాదానికి తెరపడినట్లయింది.

# రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ: డిప్యూటీ సీఎం

హైదరాబాద్, నవంబర్ 13 (భారత శక్తి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారితనంగా పనిచేస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండల పరిధిలోని గంధసిరి గ్రామంలో వేంచేసి ఉన్న కాకతీయుల కాలం నాటి శ్రీ సుందర మౌలేశ్వరస్వామి పురాతన ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రెండు కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా గురువారం గంధసిరి గ్రామంలో ఏర్పాటు చేసిన శంకుస్థాపనకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆలయ నిర్మాణా శంకుస్థాపన కు వచ్చిన భట్టి విక్రమార్క కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని గుడి వద్దకు చేరుకొని భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. నేను ఆనాడు చేసిన పీపుల్ మార్చ్ పాదయాత్రలో భాగంగా గంధసిరి గ్రామానికి చేరుకోగానే కొంతమంది నాయకులు ఇక్కడ ఉన్న కాకతీయుల కాలం నాటి శ్రీ సుందర మౌలేశ్వరస్వామి పురాతన ఆలయం గురించి చెప్పారు. నేను ఆరోజు మాట ఇచ్చా మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ గుడికి కావలసిన ఏర్పాట్లు చేస్తా అని చెప్పా ఇచ్చిన మాట ప్రకారమే ఈరోజు 2 కోట్లు నిధులు మంజూరు చేశాను. కాంగ్రెస్ పార్టీ వచ్చిన దగ్గర నుంచి ప్రజలకు ఇచ్చే పథకాల గురించి ప్రజలకు మరోసారి వివరించారు. మహిళలు



కూరగాయలకు మార్కెట్ కి వెళ్ళాలి అన్నా ఉచిత బస్సులోనే ప్రయాణిస్తున్నారు. ఆనాడు టిఆర్ఎస్ పెద్దలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదు టిఆర్ఎస్ ఉంటేనే కరెంట్ ఉంటుంది అన్నారు. అసలు రాష్ట్రంలో కరెంటు ఉత్పత్తి చేసిందే కాంగ్రెస్ పార్టీ, రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ, నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ, టీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాల పాలనలో నిరుద్యోగులకు చేసింది ఏమీ లేదు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్రూప్ 1,గ్రూప్ 2 ఇతర ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చి వారికి నియామక పత్రాలు అందజేసింది. రాష్ట్రవ్యాప్తంగా 70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కల్పించాం. అందుకే నేను చాలా ధైర్యంగా చెప్పగలను ఇవన్నీ కూడా ప్రజా సంక్షేమం కోసం చేసిన కార్యక్రమాలే, మధిర నియోజకవర్గం వ్యాప్తంగా ఎలాంటి సమస్య వచ్చినా మీ బిడ్డగా నేను నిలబడతానని ప్రజల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్, లోకల్ బాడీ కలెక్టర్ శ్రీజ,DRDO పిడి సన్నాసయ్య, అధికారులు, నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

*** మధిర నియోజకవర్గం అధికారులకు సమీక్ష..**

మధిర నియోజకవర్గ వ్యాప్తంగా విద్యాశాఖ మరియు ఇందిరా మహిళా డెయిరీ పై సంబంధిత అధికారులకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్, లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అధికారులు పాల్గొన్నారు.


# ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలి: మంత్రి పొన్నం

హైదరాబాద్, నవంబర్ 13 (భారత శక్తి): ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త కాలనీలకు బస్సు రూట్‌లు పెంచేలా అధ్యయనం చేయాలన్నారు. కారుణ్య నియామకాల కింద ఎంపికైన కండక్టర్ల ప్రొవిజన్ పీరియడ్ రెండేళ్లకు తగ్గించాలని చెప్పారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలు లాభాల్లోకి వచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆరంఘర్‌లో బస్సు టెర్మినల్ కోసం పోలీసు శాఖ భూములపై చర్చించాలన్నారు. హైదరాబాద్‌లో కొత్త డిపోలకు స్థల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బస్సు



ప్రమాదాలను తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు చేస్తామని వివరించారు. త్వరలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

# చెట్టును ఢీకొట్టిన కారు.. ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు



ఆత్మకూరు, నవంబర్ 13 (భారత శక్తి): చెట్టును కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా..మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగట్టు శివారులో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాక పల్లికి చెందిన పార్శ సంపత్, హనుమకొండ జిల్లా పరకాల మండలానికి చెందిన బొంపల్లి కిషన్, వెంకటేశ్ , ఆత్మకూరుకు చెందిన చింతపట్ల మురళీకృష్ణలు కలిసి కారులో పరకాల నుంచి హనుమకొండ వైపు వెళ్తున్నారు. అర్ధరాత్రి సమయంలో కొత్తగట్టు శివారులో కారు అతివేగంగా వెళ్తూ రహదారి పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పార్శ సంపత్, బొంపల్లి కిషన్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన మురళీకృష్ణ, వెంకటేష్‌లను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి, మృతదేహాలను మార్చురీకి తరలించారు. సంఘటనా స్థలంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

# టెన్త్ క్లాస్ విద్యార్థులకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కానుక



హైదరాబాద్, నవంబర్ 13 (భారత శక్తి): హైదరాబాద్ కలెక్టర్ హరిచందనకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ క్లాస్ విద్యార్థులు అందరి పరీక్ష ఫీజులు తానే చెల్లిస్తానని లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా టెన్త్ క్లాస్ విద్యార్థుల వివరాలు ఇవ్వాలని కోరారు. కాగా, ఇటీవలే బండి సంజయ్ కూడా టెన్త్ క్లాస్ విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పిన విషయం తెలిసిందే. తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న టెన్త్ విద్యార్థులకు శుభవార్త చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థులందరికీ టెన్త్ పరీక్ష ఫీజును తానే భరించడానికి ముందుకు వచ్చారు. తనకు వచ్చే వ్యక్తిగత వేతనం నుంచే వీరికి పరీక్ష ఫీజులు చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు నిధులు విడుదల చేసేందుకు వీలుగా ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆయన లేఖలు కూడా రాసి పంపించారు. పరీక్ష ఫీజు చెల్లించలేక ఏ ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా చూసేందుకు కేంద్రమంత్రులు ఇద్దరూ తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# టెట్ అభ్యర్థులకు అలర్ట్.. క్వాలిఫైయింగ్ మార్క్స్‌పై స్పష్టత

హైదరాబాద్, నవంబర్ 13 (భారత శక్తి): టీచర్ ఉద్యోగాల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 15 నుంచి 29 వరకు దరఖాస్తులు స్వీకరణ.. వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 31 వరకు టెట్ ఎగ్జామ్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో పాస్ అయిన వారు మాత్రమే టీచర్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే DSC పరీక్షకి అర్హులు అనే సంగతి అందరికీ తెలిసిందే.

**అర్హత సాధించాలంటే :**

SC, ST అభ్యర్థులకు (40%)60 మార్క్స్ కావాలి

BC అభ్యర్థులకు(50%) 75 మార్క్స్ కావాలి

OC అభ్యర్థులకు (60%) 90 మార్కులు కావాలి

**పరీక్ష విధానం :**

మొత్తం 5 విభాగాల్లో 150 మార్కులు ఉంటుంది.

మొదటి విభాగంలో సైకాలజీ 30 మార్కులు

రెండవ విభాగంలో తెలుగు 30 మార్కులు

మూడవ విభాగంలో ఇంగ్లీష్ 30 మార్కులు

నాలుగో విభాగంలో మ్యాథ్స్ 30 మార్కులు




ఏదో విభాగంలో సోషల్ సైన్స్/ ఫిజికల్ సైన్స్ / బయోలాజికల్ సైన్స్ 30 మార్కులు

మొత్తం 150 మార్కులు

**ముఖ్యమైన తేదీలు :**

అప్లికేషన్ ప్రారంభం : ఈ నెల 15 నుండి

చివరి తేదీ : ఈ నెల 29 వరకు


పరీక్ష తేదీ: జనవరి 3 నుండి 31 వరకు

పరీక్ష ఆన్లైన్ విధానం లో ఉంటుంది

అప్లై చేయుటకు web site : https://tgtet.aptonline.in/tgtet/

# లిఫ్ట్ గుంతలో పడి.. వృద్ధుడి మృతి


హైదరాబాద్, నవంబర్ 13 (భారత శక్తి): పాతబస్తీలోని చాంద్రాయణ గుట్టలో దారుణం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు లిఫ్ట్ గుంతలో పడి వృద్ధుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. అబ్దుల్ బిన్ సయోద్ (69) కుమార్తె చాంద్రాయణగుట్టలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తోంది. ఆమెను చూసేందుకు ఐదో ఫ్లోర్‌కు వెళ్లిన సయోద్.. తిరిగి వచ్చేందుకు లిఫ్ట్ దగ్గరికి వచ్చాడు. అయితే, లిఫ్ట్ రాకముందే తలుపులు తెరచుకోవడంతో.. ఆ గుంతలో పడి ప్రాణాలు కోల్పోయాడు.



సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ అపార్ట్‌మెంట్‌కు జీహెచ్ఎంసీ అనుమతి లేదని స్థానికులు చెబుతున్నారు. అనుమతి లేకుండానే ఐదు అంతస్తులు పూర్తి చేసినట్లు సమాచారం.

# వేగమే వేదంగా పనిచేస్తున్నాం: సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 13 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. విశాఖలో పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు ప్రారంభం కావడానికి ఒక రోజు ముందే రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారింది. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు 15కు పైగా సమావేశాల్లో పాల్గొని, సుడిగాలి పర్యటన చేశారు. తైవాన్, ఇటలీ రాయబారులతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “పెట్టుబడుల సదస్సుకు ముందే ఈ స్థాయిలో స్పందన రావడం సంతోషకరం. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన ప్రతి పారిశ్రామికవేత్తకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని పెట్టుబడుల్లో నంబర్ 1 స్థానంలో నిలపడమే మా ధ్యేయం. వేగమే వేదంగా పనిచేస్తున్నాం” అని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరిస్తూ, “ఏపీకి వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, పోర్టులు, మెరుగైన రోడ్డు, రైలు కనెక్టివిటీ ఉన్నాయి. దీంతో ఏపీ లాజిస్టిక్స్ రంగానికి కేంద్రంగా మారుతుంది. గ్రీన్ ఎనర్జీ, హార్టికల్చర్, ఆక్వా కల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో అపార అవకాశాలున్నాయి. ఆలోచనలతో వచ్చేవారికి అన్ని విధాలా అండగా ఉంటాం. ‘ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త’ నినాదంతో ముందుకెళుతున్నాం. ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ విధానంతో అనుమతుల్లో ఎలాంటి జాప్యం ఉండదు” అని చంద్రబాబు




పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వంలో వెళ్లిన కంపెనీలు వెనక్కి**

గత ప్రభుత్వ విధానాలు నచ్చక రాష్ట్రం విడిచి వెళ్లిన రెన్యూ పవర్ వంటి పలు ప్రముఖ సంస్థలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం విశేషం. కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న పారిశ్రామిక అనుకూల వాతావరణానికి ఇది నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. రెండు రోజుల సదస్సులో మొత్తం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తుండగా, తొలిరోజే మూడో వంతుకు పైగా లక్ష్యం నెరవేరడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇదే కార్యక్రమంలో, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ల కోసం బాలాజీ యాక్షన్ బిల్డ్‌వేర్ సంస్థ రూ.1 కోటి విరాళం చెక్కును ముఖ్యమంత్రికి అందజేసింది.

# ఢిల్లీ పేలుడు కేసు... మూడో కారు కూడా స్వాధీనం

ఢిల్లీ, నవంబర్ 13 (భారత శక్తి): ఢిల్లీ పేలుళ్ల కేసుకు సంబంధించి దర్యాప్తులో కీలక పురోగతి లభించింది. ఈ ఘటనలో ఉగ్రవాదులు ఉపయోగించిన మూడో కారును అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఫరీదాబాద్‌లోని అల్‌ఫలాహ యూనివర్సిటీ క్యాంపస్‌లో డాక్టర్ షాహీన్ కు చెందిన మారుతి సుజుకి బ్రెజా కారును పోలీసులు కనుగొన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఓల్డ్ ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనకు సంబంధించి డీఎన్ఏ పరీక్షల ద్వారా ఉమర్ ఉన్ నబీ అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించారు. భద్రతా వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఉగ్రవాద మాడ్యూల్ ‘స్పెక్టాక్యులర్ టెర్రర్ అటాక్’ పేరుతో భారీ విధ్వంసానికి ప్లాన్ చేసింది. దీని కోసం మొత్తం మూడు వాహనాలను సిద్ధం చేసింది. ఈ కార్లతో మొదట ఐఈడీ పేలుళ్లు జరిపి, ఆ తర్వాత అసాల్ట్ రైఫిళ్లతో కాల్పులకు తెగబడాలని కుట్ర పన్నారు. ఇందుకోసం హ్యుందాయ్ ఐ20, రెడ్ ఫోర్డ్ ఎకోస్పోర్ట్, మారుతి బ్రెజా కార్లను సమకూర్చుకున్నారు. వీరి ప్లాన్‌లో భాగంగా ఇప్పటికే ఐ20 కారును ఎర్రకోట సమీపంలో పేల్చివేశారు. మిగిలిన రెండు వాహనాల కోసం పోలీసులు ‘బీ ఆన్ ది లుకౌట్’ (బోలో) హెచ్చరికలు జారీ చేశారు. వాటిలో మరిన్ని పేలుడు పదార్థాలు ఉండవచ్చనే అనుమానంతో గాలింపు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో, బుధవారం ఫరీదాబాద్‌లో రెడ్ ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును అధికారులు గుర్తించారు. తాజాగా, డాక్టర్ షాహీన్‌కు చెందిన బ్రెజా కారును యూనివర్సిటీ క్యాంపస్‌లో కనుగొన్నారు. ఈ వాహనాలను సమకూర్చడంలో ఉమర్ ఉన్ నబీ కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. లోతుగా దర్యాప్తు చేయగా ఈ మాడ్యూల్ లక్ష్యం కేవలం ఢిల్లీ మాత్రమే కాదని, అయోధ్య కూడా వారి టార్గెట్ లిస్టులో ఉందని తెలిసి అధికారులు అప్రమత్తమయ్యారు. అయోధ్యలోని రామ మందిరంలో నవంబర్ 25న కుంకుమ పతాకావిష్కరణ సందర్భంగా ఉగ్రదాడికి ప్లాన్ చేసినట్లు వెల్లడైంది. ఈ పేలుళ్ల కోసం అమ్మోనియం నైట్రేట్, ఆర్డీఎక్స్ మిశ్రమాన్ని సిద్ధం చేసుకున్నట్లు గుర్తించారు. ఈ భారీ ఉగ్రకుట్రకు 2022లోనే టర్కీలో బీజం పడినట్లు భద్రతా సంస్థలు తెలిపాయి. టర్కీలోని ‘ఉకాసా’ అనే హ్యాండ్లర్ మార్గదర్శకత్వంలో ఉమర్ ఈ కుట్రను నడిపినట్లు తేలింది. ప్రస్తుతం ఈ మాడ్యూల్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసు బృందాలు దర్యాప్తును కొనసాగిస్తున్నాయి.

# విదేశాల్లోని భారత ఉద్యోగులకు గుడ్ న్యూస్.. కేంద్రం సరికొత్త బిల్లు!

ఢిల్లీ, నవంబర్ 13 (భారత శక్తి): విదేశాల్లో పనిచేస్తున్న, పనిచేయడానికి వెళుతున్న భారతీయ కార్మికులు, నిపుణుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వలసలపై వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో, భారత ఉద్యోగులకు మెరుగైన అవకాశాలు, భద్రత కల్పించడంతో పాటు, వారు తమ ఉద్యోగ కాలం ముగిశాక తిరిగి స్వదేశానికి వచ్చేలా ప్రోత్సహించేందుకు ‘ఓవర్సీస్ మొబిలిటీ (ఫెసిలిటేషన్ అండ్ వెల్ఫేర్) బిల్లు, 2025’ను ప్రతిపాదించింది. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక ‘ది డిప్లొమాట్’ కథనం ప్రకారం, ఈ కొత్త బిల్లు కేవలం వలస విధానంలో మార్పు కాదు, ఆర్థిక దౌత్యంలో కార్మిక శక్తిని ఒక మూలస్తంభంగా మార్చే ప్రయత్నం. ఇప్పటివరకు అమల్లో ఉన్న 1983 నాటి పాత వలస చట్టం స్థానంలో ఈ కొత్త బిల్లు సమగ్రమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురానుంది. ఇది కేవలం విదేశీ ఉపాధిని సులభతరం చేయడమే కాకుండా, ఉద్యోగులు సురక్షితంగా తిరిగి రావడం, స్వదేశంలో వారి పునరేకీకరణకు కూడా భరోసా ఇస్తుంది. ఈ బిల్లు ద్వారా భారత ప్రభుత్వం తన కార్మికుల వలసలను కేవలం ప్రేక్షకపాత్రకే పరిమితం చేయకుండా, వారి ఉద్యోగ నిబంధనలపై ఇతర దేశాలతో చురుగ్గా చర్చలు జరుపుతోంది. 2014 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే యూరప్, ఆసియా, గల్ఫ్ ప్రాంతాల్లోని దాదాపు 20 దేశాలతో కార్మిక మొబిలిటీ ఒప్పందాలు కుదుర్చుకుంది. “అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గి కార్మికుల కొరత ఏర్పడుతుంటే, భారత్ వంటి దేశాల్లో స్థిరమైన జనాభా ఉన్నా ఉద్యోగాల కొరత ఉంది. ఈ సమస్యకు శాశ్వత వలసలు పరిష్కారం కాదు, ఎందుకంటే దీనివల్ల రాజకీయ వ్యతిరేకత వస్తోంది. అందుకే, భారత్ తన నైపుణ్యాలను ఒక నిర్ణీత కాలపరిమితితో ఎగుమతి చేసే మార్గాన్ని ఎంచుకుంది” అని ఆ కథనం విశ్లేషించింది. భారత్ అతిపెద్ద ఆస్తి 25 ఏళ్లలోపు వయసున్న 60 కోట్లకు పైగా యువత కాగా, అభివృద్ధి చెందిన దేశాలు తీవ్రమైన కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నాయి. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ అధ్యయనం ప్రకారం, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 4.5 నుంచి 5 కోట్ల మంది కార్మికుల కొరత ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో జర్మనీ, జపాన్ వంటి దేశాలు భారతీయ కార్మికుల కోసం చురుగ్గా ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే భారత్ కుదుర్చుకుంటున్న ఒప్పందాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఉదాహరణకు, భారత్‌యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ప్రకారం, యూకేలో తాత్కాలికంగా పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు అక్కడి సామాజిక భద్రతా చందాలు చెల్లించకుండా మూడేళ్లపాటు మినహాయింపు పొందారు. దీనివల్ల భారత కంపెనీలకు ఏటా సుమారు రూ.4,000 కోట్ల ఆదా అవుతుందని అంచనా. ప్రతిపాదిత కొత్త బిల్లు వివిధ దేశాల ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంచడానికి, అంతర్జాతీయ వలస ఒప్పందాలను పర్యవేక్షించడానికి, డేటా ఆధారిత విధానాలను రూపొందించడానికి దోహదపడుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా, విదేశాలకు వెళ్లే భారతీయుల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి, వారి హక్కులను కాపాడటానికి అవసరమైన వ్యవస్థలను ఇది బలోపేతం చేయనుంది.

## ఫార్చ్యూన్25 జాబితాలో

# 16 కంపెనీలు భారత్ లోనే!

ఢిల్లీ, నవంబర్ 13 (భారత శక్తి): ప్రపంచ కార్పొరేట్ రంగంలో భారత్ తనదైన ముద్రను మరింత బలపరుస్తోంది. పని చేయడానికి ప్రపంచంలోనే అత్యుత్తమమైన 25 కంపెనీలలో (ఫార్చ్యూన్ వరల్డ్స్ బెస్ట్ వర్క్‌ప్లేసెస్ 2025) ఏకంగా 16 సంస్థలు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తాజా నివేదిక వెల్లడించింది. వర్క్‌ప్లేస్ కల్చర్‌పై ప్రపంచవ్యాప్త అధికారిక సంస్థగా పేరున్న ‘గ్రేట్ ప్లేస్ టు వర్క్’, ప్రముఖ ‘ఫార్చ్యూన్ మీడియా’ సంయుక్తంగా ఈ జాబితాను గురువారం విడుదల చేశాయి. ఈ జాబితా రూపకల్పన కోసం 2024, 2025 సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా 90 లక్షల మందికి పైగా ఉద్యోగుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సర్వే సుమారు 2.5 కోట్ల మంది ఉద్యోగుల అనుభవాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఉద్యోగుల నమ్మకం, వారు చేసే పని పట్ల గర్వం, సహోద్యోగులతో స్నేహపూర్వక వాతావరణం వంటి అంశాల్లో స్థానికంగా, ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన పనితీరు కనబరిచిన కంపెనీలకు ఈ జాబితాలో ఉన్నత ర్యాంకులు లభించాయి. ఈ ఘనతపై గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా సీఈఓ బల్బీర్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. “గుర్తింపు పొందిన 25 సంస్థలలో 16 కంపెనీలు భారత్‌లో బలంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇది ప్రపంచ వర్క్‌ప్లేస్ కల్చర్‌ను తీర్చిదిద్దడంలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనం. ఈ జాబితాలో విజేతలుగా నిలిచిన వారందరికీ నా హృదయపూర్వక అభినందనలు. వీరు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు” అని ఆయన అన్నారు. ఈ జాబితాలోని కంపెనీలు గొప్ప కార్పొరేట్ సంస్కృతికి సరిహద్దులు లేవని నిరూపిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. నమ్మకం, న్యాయబద్ధతతో సంస్థలను నడిపినప్పుడు, ఉద్యోగులు, పనితీరు రెండూ విశ్వవ్యాప్తంగా అభివృద్ధి చెందుతాయని గ్రేట్ ప్లేస్ టు వర్క్ గ్లోబల్ సీఈఓ మైఖేల్ సి. బుష్ తెలిపారు. “ఈ గొప్ప కంపెనీలు మన గ్రహంపై చూపే ప్రభావం ఒక పవిత్రమైన బాధ్యత. సర్వేలో పాల్గొన్న 90 లక్షల మంది ఉద్యోగులలో, ఈ సంస్థల్లో పనిచేస్తున్న వారు తమను కంపెనీ నమ్ముతుందని, తాము వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎదగాలని కోరుకుంటుందని చెప్పారు,” అని ఆయన వివరించారు. ఫార్చ్యూన్ ఎడిటర్ఇన్‌చీఫ్ అలిసన్ షోన్‌టెల్ మాట్లాడుతూ, ఈ జాబితా ఉద్యోగుల దృష్టిలో నేటి అసాధారణమైన కార్యాలయాలను హైలైట్ చేస్తుందన్నారు. ఇక్కడ ఉద్యోగులు తమపై నమ్మకాన్ని ఉంచి, సాధికారత కల్పించారని భావిస్తూ తమ అత్యుత్తమ పనితీరును కనబరుస్తారని ఆమె పేర్కొన్నారు.

# పెట్టుబడులకు ఫ్యూచర్ గ్యారంటీ

ఢిల్లీ, నవంబర్ 13 (భారత శక్తి): ‘‘భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖద్వారంగా మారింది. గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తోపాటు అనేక రాజకీయ పార్టీలు ఆయా ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలుస్తూ వస్తున్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ)లకు గమ్యస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడం అన్ని విధాలా శ్రేయస్కరం. ఈ నేపథ్యంలో ప్రపంచ పారిశ్రామికవేత్తలు ముందుకురావాలి’’ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం దిల్లీలో జరిగిన యూఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం వార్షిక సదస్సులో సీఎం ప్రసంగించారు. ‘‘భౌగోళికంగా దేశానికి కేంద్రస్థానంలో ఉన్న హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణ పరిస్థితులున్నాయి. భద్రతకు ఎలాంటి ఢోకా లేదు. అందువల్ల పెట్టుబడిదారులకు అన్నివిధాలా అది ఉత్తమమైన గమ్యస్థానం. పెద్దసంఖ్యలో నిపుణులైన యువత ఉన్న, వేగవంతమైన వృద్ధి రేటుతో ముందుకు సాగుతున్న రాష్ట్రం తెలంగాణ. మహిళా సాధికారత సాధించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి.. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నాం. ఇది దేశంలోనే అత్యంత ఆధునిక నగరంగా రూపుదిద్దుకుంటోంది. మూసీ నది పునరుజ్జీవం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయ్, సియోల్‌లలోని రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్‌లోనూ నైట్ ఎకానమీ కొత్త పుంతలు తొక్కుతుంది. డ్రైపోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్‌ఆర్ఆర్‌ల మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలకమైన ప్రాజెక్టులనూ చేపడుతున్నాం. చైనా+1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ రాష్ట్రమే. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి అంతర్జాతీయ వర్సిటీలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే... తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుంది. భారతదేశంలో రహదారులకు ఎక్కువగా నేతల పేర్లుంటాయి. హైదరాబాద్‌లో ఆ సంప్రదాయాన్ని మార్చాలని భావిస్తున్నాం. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీల పేర్లు పెడతాం. తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దాన్ని సాధించడానికి గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నాం’’ అని పిలుపునిచ్చారు. ఈ సదస్సు ప్రారంభంలో ఆయన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రదర్శించారు.

# రేపు ఉదయం 8 గంటల నుంచి జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు

హైదరాబాద్, నవంబర్ 13 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని రిటర్నింగ్ ఆఫీసర్ కర్ణన్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ ఈ నెల 11న ముగిసింది. రేపు (నవంబరు 14) ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్వో కర్ణన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన అన్నారు. రేపు ఉదయం పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తామని వెల్లడించారు. మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నందున ప్రత్యేక అనుమతి తీసుకుని లెక్కింపునకు 42 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# మోడల్ వర్సిటీలుగా జేఎన్‌టీయూహెచ్, ఓయూ!

హైదరాబాద్, నవంబర్ 13 (భారత శక్తి): ‘రాష్ట్రంలో తొలి విడతగా జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియాలను మోడల్ వర్సిటీలుగా తీర్చిదిద్దాలి.. మౌలిక వసతుల కోసం మూడేళ్లలో ఈ రెండు వర్సిటీలకు ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించాలి’ అని విద్యాసంస్థల్లో మౌలిక వసతులపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన కోర్ గ్రూప్ సిఫార్సు చేయనుంది. జాతీయ విద్యా విధానం తరహాలో తెలంగాణకూ ప్రత్యేకంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఛైర్మన్‌గా కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. నివేదికల రూపకల్పనకు 11 కోర్ గ్రూప్‌లను సర్కారు నియమించింది. మౌలిక వసతులు, డిజిటల్ టెక్నాలజీ, పరిశోధన, సిలబస్ తదితర అంశాలపై పలుమార్లు సమావేశమైన కోర్ గ్రూప్‌లు ఈ వారంలో నివేదికలను కమిటీ ఛైర్మన్‌కు అందజేయనున్నాయి. తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలోని మౌలిక వసతుల గ్రూప్ పలు ఆసక్తికర సిఫార్సులను చేయనున్నట్లు తెలిసింది. అవి.. విద్య, మౌలిక వసతులు, పరిశోధన, నవకల్పన అంశాల్లో ఎక్సలెన్స్ సాధించేందుకు.. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను చేరుకునేందుకు ఎంపిక చేసిన వాటిని మోడల్ వర్సిటీలుగా అభివృద్ధి చేయాలి. మొదటి విడతలో జేఎన్‌టీయూహెచ్, ఓయూలను ప్రాధాన్యంగా తీసుకోవాలి. మూడేళ్లలో ఒక్కో వర్సిటీకి విశ్వవిద్యాలయ మౌలిక వసతుల ఆధునికీకరణ నిధి కింద రూ.200 కోట్లు చొప్పున ఇవ్వాలి. కేంబ్రిడ్జి, స్టాన్‌ఫర్డ్ వర్సిటీల తరహాలో అంతర్జాతీయ స్థాయిలో ఆ రెండు ప్రాంగణాలను రీడిజైన్ చేయాలి. మోడల్ వర్సిటీల్లో విదేశీ విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహాలతోపాటు కౌన్సెలింగ్ విభాగాలను నెలకొల్పాలి. అంతర్జాతీయ నిపుణులతో సమన్వయం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో ఉన్నతస్థాయి సలహా కమిటీని నియమించాలి. ఆ కమిటీ.. యూకే, సింగపూర్, థాయ్‌లాండ్‌లలో విభిన్నమైన డిజైన్లు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు తెలుసుకొని అమలు చేసేందుకు ఆయా దేశాల్లో పర్యటించాలి. కేంద్రీయ వర్సిటీల మాదిరిగా అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ప్రతి వర్సిటీలో ఉపకులపతి ఛైర్మన్‌గా మౌలిక వసతుల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి పెద్ద విద్యా సంస్థలో ఉద్యోగుల పిల్లల కోసం ఛైల్డ్ కేర్ సెంటర్ నెలకొల్పాలి. అన్నింటినీ హరిత ప్రాంగణాలుగా తీర్చిదిద్దాలి. విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించేందుకు ప్రతి హాస్టల్‌లో వెల్‌నెస్ రూమ్ తప్పనిసరి చేయాలి. బాస్కెట్‌బాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ లాంటివి ఆడుకునేందుకు అవకాశం కల్పించాలి.

# ఉద్యోగుల సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి

* ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సచివాలయంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం. నరేందర్ రెడ్డి ని కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు..
* ఆరోగ్య మిత్ర ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలి: గిరి.యాదగిరి



హైదరాబాద్, నవంబర్ 13, భారతశక్తి : తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈరోజు సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖలోని ఉద్యోగుల సమస్యలు అలాగే ఆరోగ్య మిత్రాల జీతభత్యాల సమస్యలు మరియు ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలోని నాన్ టీచింగ్ సిబ్బందికి పి.ఆర్.సి ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి గారి పేరిట వారి సలహాదారు అయిన ప్రభుత్వ సలహాదారు శ్రీ వేం నరేందర్ రెడ్డి గారిని గురువారంరోజు సిపిఎం పార్టీ మాజీ ఎమ్మెల్యే శ్రీ జూలకంటి రంగారెడ్డి గారి ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఇందులో ప్రధానంగా ఆరోగ్య మిత్రాలకు సంబంధించి గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం వారికి వేతనాలు పెంచుతామని డిఇ ఓ కేడర్ లోకి మార్చి 19600 జీతం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత కాలంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి గారు ప్రిన్సిపల్ సెక్రటరీ గారు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ గారు అనేక ప్రతిపాదనలు తయారుచేసి రెండు మూడు దఫాలుగా ఫైనాన్స్ డిపార్ట్మెంట్కు పంపడం జరిగింది .దాన్ని ఫైనాన్స్ డిపార్ట్మెంట్ యొక్క సెక్రటరీ రిజెక్ట్ చేస్తున్నారు. ఈ విషయమై తమరు జోక్యం చేసుకొని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి చెప్పి ఆరోగ్య మిత్రలకు అందరికి జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. దీని వల్ల సుమారు 900 మంది ఆరోగ్య మి త్రాలు 15 ,20 సంవత్సరాలుగా పనిచేస్తున్న వాళ్లకు న్యాయం జరుగుతుందని అనేక విషయాలు వివరించడం కూడా జరిగింది .వాళ్ళ చేస్తున్న పనికి ఇస్తున్న జీతానికి సంబంధం లేకుండా ఉంది .సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పి జూలకంటి. రంగారెడ్డి, వేమనరేందర్ రెడ్డి కి వివరించారు. దాని మీద ఆయన సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి గారితో మాట్లాడి అలాగే వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో కూడా మాట్లాడి ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో పని అయ్యేవిధంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.

* **ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల సిబ్బంది సమస్యలపై వినతి పత్రం:**

165 ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లోని 30 వేల మంది నాన్ టీచింగ్ సిబ్బందికి గత పది సంవత్సరాలుగా జీతభత్యాల విషయంలో అన్యాయం జరుగుతున్నది. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి గారితో పాటు ఆ యూనియన్ నాయకత్వం కూడా కలిసి వేం నరేందర్ రెడ్డి కి ప్రభుత్వ సలహాదారుకు ప్రత్యేకంగా వినతిపత్రం కూడా ఇవ్వడం జరిగింది .ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో యాజమాన్యాలు ప్రభుత్వంతో కొట్లాడి ఫీజు రియంబర్స్మెంట్ రకరకాల సమస్యలు పరిష్కారం చేసుకుంటున్నారు. కానీ సిబ్బంది యొక్క జీతభత్యాలు పెంచకుండా వారితో వెట్టిచాకిరి చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు పిఆర్సి ప్రకారంగా జీతభత్యాలు పెంచేవారు. తెలంగాణ వచ్చిన తర్వాత పిఆర్సి రాకుండా వారికి అన్యాయం చేశారు .కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ తో మాట్లాడితే ప్రభుత్వ కమిటి సూచిస్తే జీతాలు పెంచడానికి ఉత్తర్వులు ఇస్తామని అంటున్నారు .ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు కూడా జీవో లేదు కాబట్టి మేము పెంచమని మొండికేస్తున్నారు. ఈ విషయమై ఈరోజు వేం. నరేందర్ రెడ్డి తో చర్చ చేయడం జరిగింది. ఈ విషయమై కూడా వేం నరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలలోని అన్ని రకాల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఒక కమిటీ వేసింది ఐఏఎస్ ఆఫీసర్లతో ఆ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు కాబట్టి వాటికి మీరు ఇచ్చిన లెటర్ ని పంపిస్తామని చెప్పారు. కాబట్టి ప్రైవేటు కాలేజీల సమస్యలతో పాటు ఉద్యోగుల సమస్యలు కూడా పి.ఆర్సి విషయమై కూడా పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తో పాటు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల నాన్ టీచింగ్ సిబ్బంది ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు గారు మరియు ఆరోగ్యశ్రీ మిత్రాల రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య మరియు సీనియర్ నాయకులు డి.జి నరసింహారావు గారి తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు..

ఎల్బీనగర్ , నవంబర్ 13, భారత శక్తి : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మైనారిటీ మహిళలకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ కుట్టుమిషన్లు మంజూరు చేయించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పన లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం, మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 175 కుట్టుమిషన్లు మంజూరు కాగా.. వాటిని ఈరోజు హయత్ నగర్ లోని తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హయత్ నగర్, గడ్డి అన్నారం డివిజన్ల అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్ గారు, వేణుగోపాల్ యాదవ్ గారు నాయకులు ఖదీర్ గారు, మహిళా కాంగ్రెస్ ఎల్బీనగర్ అధ్యక్షులు స్వర్ణ మాధవి గారు, తిరుమల



శ్రీనివాస్, కందికంటి శ్రీధర్ గౌడ్, నిరంజన్, జాఫర్,రషీద్, యూసుఫ్, ప్రకాష్, జియా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమంగా మారినప్పడే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం: మధుయాష్కి గౌడ్

* దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను కలిసి మద్దతు కోరుదాం
* బీసీ రిజర్వేషన్ల ఉద్యమంలో విద్యార్థులు, యువత, డాక్టర్లు, టీచర్ల తదితరు అన్ని వర్గాల భాగస్వామ్యం అవసరం
* బీసీ ధర్మపోరాట దీక్షలో మధుయాష్కి గౌడ్




ఎల్బీనగర్, నవంబర్ 13, భారత శక్తి : రిజర్వేషన్ల ఆవశ్యకతపై అన్ని వర్గాలలో చైతన్యం నింపి ప్రజా ఉద్యమంగా మార్చినప్పుడే.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమవుతాయని టీ.పీ.సీ.సీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎం.పీ మధుయాష్కిగౌడ్ పేర్కొన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు చేయాలన్న డిమాండ్ తో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 'బీసీల ధర్మపోరాట దీక్ష' ను గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ లో నిర్వహించారు. మధుయాష్కి గారు దీక్ష కార్యక్రమానికి హాజరై తన సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల ఉద్యమం గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయికి చేరాలని.. విద్యార్థులు, యువత, టీచర్లు, డాక్టర్లు, లాయర్లు ఇలా అన్ని వర్గాలలో బీసీలకు 42% రిజర్వేషన్ల ఆవశ్యకతపై ప్రజా చైతన్యాన్ని కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలను కలిసి మద్దతు కోరి, పార్లమెంటులో బిల్లు పెట్టేందుకు మోడీ ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలన్నారు. ఇప్పుడు ఉద్యమాల రూపం మారిందని, సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకొని రిజర్వేషన్ల సాధన కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీ శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి , శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్ గార్లతో కలిసి.. బీసీ జేఏసీ నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్ , గుజ్జ కృష్ణ , తదితర నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

## అన్ని వర్గాలకు అందుబాటులోకి పర్యాటకం



: మంత్రి దుర్గేశ్

అమరావతి, నవంబర్ 13, భారత శక్తి : విశాఖలో ఈ నెల 14, 15న జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుతో పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు రానున్నట్లు ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక రంగంలో 98 ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. అన్ని వర్గాల వారికి పర్యాటకం అందుబాటులో ఉంటుందని చెప్పారు. అన్ని పర్యాటక విభాగాలను సద్వినియోగం చేసుకుంటున్నట్లు తెలిపారు. సముద్రతీరంలో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, పర్యాటక రంగంలో మెగా, ఆల్ట్రా మెగా ప్రాజెక్టులతోపాటు 2, 3 స్టార్ హోటళ్లు తెస్తున్నామన్నారు. ఎకో టూరిజంలో సమూల మార్పులు చేయబోతున్నట్లు చెప్పారు.

## ఏనుగుల దాడిలో రైతు మృతి



కుప్పం, నవంబర్ 13, భారత శక్తి : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అడవి పందులు తినేస్తాయనే భయంతో పొలం వద్ద కాపలా కాస్తున్న ఓ రైతును ఏనుగులు దాడి చేసి చంపేశాయి. ఈ సంఘటన చిత్తూరు జిల్లా కుప్పం మండలం కూర్మానిపల్లి గ్రామం వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కుప్పం మండలం కూర్మానిపల్లి గ్రామానికి చెందిన రైతు కిట్టప్ప (64) సాగుచేసిన రాగి పంటను అడవి పందుల దాడి నుంచి రక్షించుకునేందుకు ఓ గుడిసె వేసుకొని పొలం వద్ద కాపలా ఉండేవాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు ఆ పొలంలోకి ప్రవేశించి ఆ రైతు ఉంటున్న గుడిసెను ధ్వంసం చేసింది. ఈ సమయంలో కేకలు పెట్టిన ఆ రైతును ఏనుగులు తొక్కి చంపేశాయి. ఈ సమాచారం అందుకున్న కుప్పం అటవీ క్షేత్ర అధికారి జయశంకర్, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

* **రూ.10లక్షల ఆర్థికసాయం అందించాలని పవన్ ఆదేశం**

ఏనుగుల దాడిలో రైతు కిట్టప్ప మృతిచెందడంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రూ.10లక్షల ఆర్థికసాయం అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు.


## పరకామణి కేసు.. పాత్రధారులు కాదు..
### సూత్రధారులు ఎవరో తేల్చాలి: నీలాయపాలెం

తిరుపతి, నవంబర్ 13, భారత శక్తి : పరకామణి కేసులో పాత్రధారులు కాదు.. సూత్రధారులు ఎవరో సిట్ తేల్చాలని తెదేపా అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. నేరం దాచడానికి నాటి పాలక, అధికారవర్గం ఎందుకు ప్రయత్నించాయని ప్రశ్నించారు. తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆస్తులు రాయించుకొని నిందితుణ్ని వదిలేయవచ్చని చెప్పిందెవరని, దేవుడి సొమ్మును కాజేసిన దొంగను కాపాడారని విమర్శించారు. ఆస్తుల బదలాయింపు, రాజీ అంశాలు.. అప్పటి ప్రభుత్వానికి తెలుసా? అని ప్రశ్నించారు. తితిదే ప్రతి రూపాయికి వెంకన్నే యజమాని అని చెప్పారు. కల్తీ నెయ్యి, పరకామణి కేసుల్లో సూత్రధారులు సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డిలేనని అన్నారు. ఈ ముగ్గురిపై 409 సెక్షన్ కింద కేసు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.



## ఓవైపు సీఐడీ.. మరో వైపు సిట్... తిరుపతిలో ముమ్మరంగా విచారణ

తిరుపతి, నవంబర్ 13, భారత శక్తి : తిరుపతి లో ఓ వైపు సీఐడీ.. మరో వైపు సిట్ అధికారులు విచారణ కొనసాగుతోంది. కల్తీ నెయ్యి ఘటనతో పాటు పరకామణి కేసులో రెండు సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి. కల్తీ నెయ్యి కేసులో బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిలిజైన్, విపిన్ జైన్‌తో పాటు టీటీడీ ఈవో ధర్మారెడ్డిని సిట్ అధికారులు రెండు రోజుల పాటు ప్రశ్నించారు. పరకామణి కేసును సీఐడీ అధికారులు విచారిస్తున్నారు. కేసు ప్రధాన నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబ సభ్యులను పద్మావతి అతిథి గృహంలో విచారించారు. అంతేకాదు రవికుమార్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ విచారణ కొనసాగుతోంది.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.